ప్రజాశక్తి
శుక్రవారం 23 జూన్ 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

అధికారుల తప్పిదం..

నిర్వాసితుడికి తిప్పలు

పరిహారం కోసం హైకోర్టు మెట్లెక్కిన బాధితుడు

ఒంటెద్దు రంగారెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

'పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు' ముంపు గ్రామాల్లో నిర్వాసితులతో కొందరు అధికారులు ఆటలాడుకుంటున్నారు. ఏకంగా ఆత్మహత్యలు కూడా చేసుకునేందుకు అధికారులే కారకులయ్యారు. నిర్వాసితులు మాత్రం న్యాయం కోసం కోర్టు వరకు వెళ్లాల్సి వస్తోంది. ఎన్ని ఫిర్యాదులు చేసినా... అక్రమాలకు పాల్పడిన అధికారులపై ఉన్నతాధికారులు వేటు వేయకపోవడమే అక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి.

అర్థవీడు మండలంలో నిర్వాసితుల జాబితాలో నుంచి అర్హులను తొలగించడంతో గత ఏడాదిలో దంపతులిద్దరూ కంభంలోని వెలిగొండ ప్రాజెక్టు భూ సేకరణ కార్యాలయం ఎదుట పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఇంకెందరో న్యాయం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. మరి కొందరు న్యాయం కోసం హైకోర్టు మెట్లు ఎక్కక తప్పలేదు.

వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామమైన గొట్టిపడియ గ్రామా నికి చెందిన ఒంటెద్దు చిన్న నెమిలిరెడ్డి నిర్వాసితుడిగా తనకు రావాల్సిన పరిహారం పైకం మరొకరికి జమ చేయడంతో అర్హత కలిగిన నిర్వాసితుడు కోర్టును ఆశ్రయించక ▶ 2లో

'వరికపూడిసెల' ప్రాజెక్టుకు

జులైలో సిఎం జగన్ శంకుస్థాపన

12లో ▲

సంఘమిత్ర రైలుకు

తప్పిన పెను ప్రమాదం

- ఈపురుపాలెం స్ట్రైట్ కట్ వంతెన వద్ద విరిగిన రైలు పట్టా
- ప్రమాదాన్ని గుర్తించి.. రైలు ఆగేలా చేసిన చేనేత కార్మికుడు బాబు
- పట్టాలు మరమ్మత్తులు చేసి.. పునరుద్ధించిన రైల్వే అధికారులు
- 40 నిమిషాల పాటు ఆలస్యంగా నడిచిన రైళ్లు

విరిగిన రైలు పట్టా..

ప్రజాశక్తి-చీరాల

విరిగిన రైలు పట్టాను చేనేత కార్మికుడు గుర్తించి వెంటనే రైల్వే అధికారులను అప్రమత్తం చేయడంతో దానాపూర్ నుండి బెంగళూరు వెళుతున్న సంఘమిత్ర ఎక్స్ప్రెస్ రైలుకు పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన మండలంలోని ఈపురిపాలెం స్ట్రైట్ కట్ కాలువ వంతెన వద్ద గురువారం జరిగింది. చేనేత కార్మికుడు గాదె హేమసుందర్ బాబు మరియు రైల్వే సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... రైల్వే శాఖ అధికారులు అదనపు ట్రాక్‌ను నూతనంగా ఏర్పాటు చేస్తున్నారు. అయితే చీరాల ప్రాంతంలో బుధవారం వర్షం కురుస్తూ ఉండటంతో రైలు పట్టా విరిగిన స్థలాన్ని కుండ పోత వర్షంలో రైల్వేశాఖ అధికారులు గుర్తించి సరిచేశారు. అయితే ఏం జరిగిందో ఏమో తెలియదు గానీ రైల్వే ట్రాక్ కు సమీపాన నివాసం ఉండే చేనేత కార్మికుడు గాదే హేమ సుందర్‌బాబు అటువైపుగా వెళుతుండగా రైల్వే ట్రాక్‌పై రైలు ప్రయాణిస్తున్న సమయంలో పెద్దగా శబ్దం రావడంతో విషయాన్ని గమనించి.. ట్రాక్ వద్దకు వెళ్లి చూశారు. ఆ పాటికే రైలు పట్టా విరిగి ఉండడాన్ని గమనించిన బాబు దగ్గరలోని రైల్వే సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందడంతో ఓ వైపు రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. అంతలోనే అదే ట్రాక్ పై దానాపూర్ నుండి బెంగుళూరు వెళుతున్న సంఘమిత్ర ఎక్స్ప్రెస్ రైలు రానే వచ్చింది. విషయాన్ని గమనించిన చేనేత కార్మికుడు బాబు హుటాహుటిన మరో అడుగు ముందుకు వేసి ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలని దఢ సంకల్పంతో మరోవైపు ట్రాకుపై పరిగెడుతూ కేకలు వేస్తూ.. రైలు నిలుపుదల చేసేందుకు రైలు డ్రైవర్‌కు పలు రకాల సిగ్నల్స్ ఇస్తూ పరిగెత్తాడు. విషయం గ్రహించిన రైలు డ్రైవర్ రైలును నిలుపుదల చేశారు. రైల్వే సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని ▶ 2లో

హేమసుందర్‌బాబును సన్మానిస్తున్న ఎస్‌పి

● అక్కడ ఘన స్వాగతం..

కారంచేడులో..

ప్రజాశక్తి-కారంచేడు

టిడిపి మేనిఫెస్టో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల బస్సు యాత్ర కార్యక్రమంలో చివరిరోజైన గురువారం నియోజకవర్గంలో యాత్ర కారంచేడు నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా కారంచేడులో మహిళలు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావుకి, తెలుగు దేశం పార్టీ నాయకులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఏలూరి జెండా ఎగురవేసి.. అనంతరం స్థానిక కాల్వ సెంటర్లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి.. ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ శ్రీరామ్‌మాల్యాద్రి, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, చీరాల టిడిపి ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య, బాపట్ల టిడిపి ఇన్చార్జి వేగేశన నరేంద్రవర్మ పాల్గొన్నారు.

● ఇక్కడ నిరసన..

కారంచేడు గ్రామంలో తెలుగు దేశం పార్టీ సీనియర్ నేత, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ అక్కయ్యచౌదరి ఆధ్వ ర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన తెలుగు దేశం పార్టీ కార్యాలయాన్ని గురువారం పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కారంచేడుకు వచ్చి కూడా.. ప్రారంభించలేదు. అక్కయ్య చౌదరి అభిమానులు, టిడిపి నేతలు ఏలూరి వైఖరికి నిరసనగా పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన సొంత ఫ్లెక్సీ బ్యానర్ల ను చించి వేశారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెల కొన్నాయి.

- ప్రజాశక్తి, కారంచేడు

టిడిపి వాళ్లే చించేసిన ఫ్లెక్సీ

మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీస్

తల్లిని చంపిన కుమారుడు

కుటుంబ కలహాలే కారణం!

3లో ▲

25న టిడిపి అధినేత చంద్రబాబు రాక

చిన్నగుడిపాడు చేరుకోనున్న బస్సుయాత్ర

12లో ▲

సమాజ శ్రేయస్సే వ్యక్తి శ్రేయస్సు - విద్య లక్ష్యం విజ్ఞానం

బి.వి.సుబ్బయ్య హైస్కూల్
పేర్నమిట్ట (P), సంతనూతలపాడు (MD) , ప్రకాశం (DT)
ఫోన్: 9494470850,8885510515,9494220476,7901303125

సగటు మార్కు 453.15/600

సెక్రటరీ & కరస్పాండెంట్
బి.కోట్లింగము

2023 ఏప్రియల్ S.S.C పబ్లిక్ పరీక్షల ఉత్తీర్ణత శాతం : 96.36
పూర్తి పారదర్శకతతో - నిజాయితీతో జవాబుదారీతనంతో నడపబడుతున్న విద్యా సంస్థ.
ఒకరిద్దరి ర్యాంకులు గురించే కాకుండా విద్యార్థులందరికీ అత్యధిక మార్కులు వచ్చునట్లు బోధించు ఉన్నతమైన లక్ష్యం గల విద్యాసంస్థ,
అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, పూర్తి స్థాయి సైన్స్, కంప్యూటర్ ప్రయోగశాలలు,
విశాలమైన తరగతి గదులు, గ్రంథాలయము
మరియు ఆటస్థలము గల విద్యాసంస్థ.

అడ్మిషన్లు జరుగుచున్నవి.

హెడ్ మాస్టర్
వై.వేణుగోపాల్ రెడ్డి

కాలువల మరమ్మతులు పూర్తి చేయాలి: మంత్రి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రైతులకు మేలు జరిగేలా సాగునీటి కాలువల మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన అధికారులు చేపట్టాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. జల వనరుల సలహా మండలి సర్వసభ్య సమావేశం గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జరిగింది. ఆయకట్టు భూములకు సాగునీరు అందించేలా అధికారులు ప్రణాళికతో పనిచేయాలని మంత్రి నాగార్జున చెప్పారు. రైతులకు అనుకూలంగానే అధికారులు పనిచేయాలన్నారు. గతంలో ఎదురైన సమస్యలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ఒక నెల ముందుగానే సాగునీటిని విడుదల చేసిందన్నారు. పంటల సాగు కోసం రైతులు సమాయత్తమవుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో పంట కాలువలు, చెరువుల గట్టు బలోపేతం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద పనులను అనుసంధానిస్తూ కాల్వల మరమ్మతు పనులు చేస్తే మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు. కాలువల పూడికతీత, తూటి కాడ, గుర్రపు డెక్క తొలగింపు, కాల్వల మరమ్మతు పనులు నేటికీ ప్రారంభించకపోతే గుత్తేదారులపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. క్షేత్రస్థాయిలో లస్కర్లు లేని విషయాన్ని అధికారులు గుర్తించి సమస్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పి రంజిత్ బాషా, చీరాల శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి మాట్లాడారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సి హెచ్ శ్రీధర్, డిఆర్ఓ కె లక్ష్మీశివజ్యోతి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దశరథ మహారాజు, జల వనరులు, నీటి పారుదల కాలువల నిర్వహణ, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ఈ నెల 26 నుంచి జూలై 16 వరకు అనుమానిత కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని స్క్రీనింగ్ చేసి వారిలో కుష్టు వ్యాధిగ్రస్తులను పక్కాగా గుర్తించే కార్యక్రమం చేపట్టనున్నట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ మరియు క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ డి సురేష్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మార్కాపురం డివిజన్ పరిధిలోని మెడికల్ ఆఫీసర్లకు, ఆశా నోడల్ అధికారులకు, కుష్టు వ్యాధి నోడల్ అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ డి సురేష్ కుమార్ మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే పనిలో భాగంగా ఆశా కార్యకర్తలు, గ్రామ వాలంటీర్లు ఇంటింటికీ తిరిగి అనుమానిత కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించిన తరువాత వారిని వ్యాధి నిర్ధారణ కోసం డాక్టర్ వద్దకు పంపించాలన్నారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, పాలిపోయిన మచ్చలు, ముక్కు దూలం అణిగి పోవడం, కనుబొమ్మలు రాలిపోవడం, మోచేయి, మణికట్టు, మడమ దగ్గర నరాలు వాచి ఉండడం, పాదాలకు నొప్పి లేని పుండ్లు ఉండడం, అరచేతిలో చెమట పట్టకపోవడం తదితర కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని ఈ సర్వేలో గుర్తించాలన్నారు. కుష్టు వ్యాధి నిర్ధారణ అయితే భయపడాల్సిన అవసరం లేదని, వ్యాధి తీవ్రతను బట్టి ఆరు నెలల లేదా 12 నెలల పాటు చికిత్స తీసుకుంటే పూర్తిగా నయం అవుతుందని అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో మార్కాపురం డివిజన్ ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే రాహుల్, చర్మవ్యాధుల డాక్టర్ ఎఎస్ రాజు, డిప్యూటీ పారా మెడికల్ అధికారి రామిరెడ్డి, మార్కాపురం డివిజన్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్లు, లెప్రసీ నోడల్ అధికారులు, ఆశా నోడల్ అధికారులు, ఆరోగ్య కార్యకర్తలు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ డి సురేష్ కుమార్

బీసీ ప్రజా ప్రతినిధులు రాజీనామా చేయాలి

టిడిపి బీసీ సెల్ నేతల డిమాండ్

ప్రజాశక్తి-చెరుకుపల్లి

రాష్ట్రంలో బీసీలకు రక్షణ లేకుండా పోయిందని, అనేకమంది బీసీలపై అధికార పార్టీ నాయకులు దాడి చేసి హతమార్చారని, వేలాదిమంది బీసీలపై అన్యాయంగా కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేశారని పలువురు నేతలు విమర్శించారు. 30కి పైగా బీసీల పథకాలను రద్దుచేసి వారి సామాజిక ఆర్థిక ఆర్థిక అభివృద్ధికి దూరం చేస్తున్నారని టిడిపి బీసీ నాయకుడు దివి రాంబాబు అన్నారు. బీసీ సబ్ ప్లాన్ కింద 75 వేల కోట్ల రూపాయల విలువైన నిధులను అక్రమంగా దారి మళ్లించి బీసీలను అణగదొక్కుతున్నారని, దీనికి నిరసనగా పదవులు అనుభవిస్తున్న బిసి నేతలందరూ తమ పదవులకు రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కందుల వెంకటేశ్వరరావు నాగుల పున్నారావు కాటూరి నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, ఎంఆర్‌కె మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతూ కౌలు కార్డులు తీసుకోవాలి

ప్రజాశక్తి-వేమూరు

ప్రతి రైతు కౌలు కార్డు తీసుకుని దానివల్ల కలిగే ప్రభుత్వ ప్రయోజనాలు పొందాలని వేమూరు మండల వ్యవసాయ అధికారి సునీత రైతులకు సూచించారు. గురువారం వేమూరు మండలం చదలవాడ కుంచెల్లపాడు గ్రామాల రైతులకు కౌలు కార్డు ప్రయోజనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పంట నమోదు (ఈ క్రాప్ బుకింగ్), ప్రకృతి వైపరీత్యాలకు పంటలకు నష్టం వాటిల్లితే నష్టపరిహారం పొందేందుకు ఈ కార్డులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. పంట కొనుగోలు, ఇన్సూరెన్సు, ఈ సాగు ధ్రువీకరణ అదేవిధంగా పరీక్షలకు కౌలు కార్డుల ప్రయోజనం ఉంటుందన్నారు. రైతులు మట్టి నమూనాలను మీ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రంలో వీఏఏల ద్వారా భూసార పరీక్ష కార్డు ద్వారా మీ పంటకు కావాల్సిన ఎరువులు వినియోగించి భూసారాన్ని కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో చదలవాడ సర్పంచ్ డి రమేష్‌బాబు, ఎంపిటిసి, కుంచెల్లపాడు సర్పంచ్ వెంకట సుబ్బయ్య, వెల్లబాడు సర్పంచ్ ఎల్లభటి బుల్లయ్య, వీఆర్వోలు, వివిఎలు, రైతులు పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డు అందిస్తున్న ఏవో సునీత

రేపు విద్యుత్ వినియోగదారుల అదాలత్

ప్రజాశక్తి-అద్దంకి

స్థానిక సింగరకొండ రోడ్‌లోని విద్యుత్ సబ్ డివిజనల్ కార్యాలయంలో ఈ నెల 24వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తామని విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపిసిపిడిసిఎల్ అద్దంకి డివిజన్ పరిధిలోని అద్దంకి అర్బన్ మరియు 7 మండలాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సమస్యలు, లో ఓల్టేజి, అప్‌అండ్‌డౌన్ సమస్య, విద్యుత్ బిల్లుల సమస్యలు, మీటర్ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

CHANGE OF NAME

I,PADALA DIVYA W/o.PADALA VENKATA DURGA SRIKANTH(old Name) resident of 2-67, Main Bazar, Maddipadu, Prakasam District, Andhra Pradesh, I have changed my Name from PADALA DIVYA to RACHAMALLU LAKSHMI VENKATA DIVYA w/o. PADALA VENKATA DURGA SRIKANTH(New Name) Hence forth i will be know as RACHAMALLU LAKSHMI VENKATA DIVYA will be applicable for all purpose

ఒంగోలు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

IA NO 254/2020
IN
OS NO 502 /2010

షేక్ ఇమాంస (డైడ్) వగైరాలు .. పిటిషనర్లు
వర్సెస్
సయ్యద్ సలీమా బేగం మరియు ఇతరులు ..... రెస్పాండెంట్స్

నోటీసు

To
ఆర్2)
సయ్యద్ సహర్ల బేగం
భర్త మహమ్మద్ వలి,అరుణోదయ నగర్,
పేర్నమిట్ట గ్రామం, సంతనూతలపాడు మండలం
ప్రకాశం జిల్లా.

పై నెంబరు ఫైనల్ డిక్రీ పిటిషన్‌లో మీకు ఎన్ని పర్యాయములు నోటీసు పంపించినను ముట్టనందన మీ నోటీసు నిమిత్తం కోర్టు వారు తేదీ 19-07-2023న వాయిదా వేసి ఉన్నారు కావున ఆరోజు ఉదయం 10:30 కి పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేక లాయర్ గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయవలసినది లేనియెడల మీ పరోక్షమున కేసు తీర్మానం చేయ బడునని తెలియజేయడమైనది

// కోర్టు వారు ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేదీ : 19-07-2023
ఒంగోలు

ఇట్లు
యం.గంగాధరరావు
కె.శివప్రసాదరావు
పిటిషనర్ తరపు న్యాయవాదులు
ఒంగోలు
సెల్ : 9866729690

తప్పిన పెను ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

విరిగిన పట్టాను పునరుద్ధరించారు. రైల్వే పట్టాలు మరమ్మతులు సుమారు 40 నిమిషాల పాటు జరగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రైలు ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టి అప్రమత్తం అవ్వడంతో రైల్వే ప్రయాణికులతో పాటు అధికారులు అందరూ ఊపిరి పీల్చుకున్నారు. తిరిగి అదే ట్రాకుపై రైళ్లు యథావిధిగా కొనసాగాయి. ప్రమాదం బారి నుంచి ప్రయాణికులను కాపాడిన చేనేత కార్మికుడు హేమ సుందర్‌బాబును ఎస్‌పి వకుల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించి.. సన్మానించారు.

నిర్వాసితుడికి తిప్పలు

(మొదటిపేజీ తరువాయి)

తప్పలేదు. చిన్న నెమిలిరెడ్డికి గొట్టిపడియ పంచాయతీలోని అక్కచెరువు గ్రామంలో సర్వే నెంబర్ 19/11లో 1.13 ఎకరాల భూమి ఉంది. వ్యవసాయ భూమి వారసత్వముగా సంక్రమించింది. ఆ భూమి వెలిగొండ ప్రాజెక్టు ముంపులో పోవడంతో పరిహారం మంజూరైంది. అధికారులు ఏమి మాయ చేశారో ఏమో తెలియదు కానీ... ఆ భూమికి సంబంధించిన పరిహారం రూ. 1,32,200/- అదే గ్రామానికి చెందిన సుంకరి చిన్న పెద్దన్నకు ఖాతాలో జమ కావడం జరిగింది. అప్పట్లో చిన్న నెమిలిరెడ్డి అధికారులు అడిగినంత ముడుపు ముట్టజెప్పనందుకు ఓ అధికారి కావాల్సి చేసిన తప్పిదంతో అర్హత కలిగిన చిన్న నెమిలిరెడ్డికి కాకుండా ఎలాంటి సంబంధం లేని సుంకరి చిన్న పెద్దన్న ఖాతాలో జమ చేసేలా చర్యలు తీసుకోవడం జరిగింది. అప్పటి నుంచి నేటి వరకు పదిహేనేళ్లుగా అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయారు. ఇక లాభం లేదని తెలుసుకున్న చిన్న నెమిలిరెడ్డి కుమారుడు ఒంటెద్దు రంగారెడ్డి ఏకంగా హైకోర్టును ఆశ్రయించాడు. తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, తనకు రావాల్సిన పరిహారం ఇప్పించాలని పిటీషన్ దాఖలు చేశాడు. సుంకరి చిన్న పెద్దనకు త్వరలో ఇవ్వబోయే ఆర్అండ్ఆర్ ప్యాకేజి నిలుపుదల చేయాలని కోరారు. ఒంటెద్దు చిన్న నెమిలిరెడ్డికి జరిగిన అన్యాయంపై కోర్టు ఎలాంటి తీర్పు వెల్లడిస్తుందో చూడాలి మరి.!

కౌలు రైతు కార్డు అందజేస్తున్న దృశ్యం

కౌలు రైతు గుర్తింపు కార్డులు పొందాలి: ఏవో

ప్రజాశక్తి-చెరుకుపల్లి

కౌలు రైతు కార్డులు పొంది వాటిని కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి టి బాలాజీ గంగాధర్ సూచించారు. గురువారం చెరుకుపల్లి-1 సచివాలయంలో కౌలు రైతులతో పంట సాగుదారుల హక్కు పత్రాల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కౌలు రైతు కార్డుల నమోదు ద్వారా కౌలు రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర, పంటలకు నష్టపరిహారం, పంటల బీమా, ఇన్ పుట్ సబ్సిడీ, వేసిన పంటకు ఈ క్రాప్ నమోదు ద్వారా కౌలు రైతుల అకౌంట్లోనే అమ్మిన డబ్బు పడేవిధంగా చేసుకోవచ్చని తెలిపారు. కౌలు రైతు కార్డు కేవలం 11 నెలలు మాత్రమే అమలులో ఉంటుందని, దీనివలన కూడా ఎటువంటి ఇబ్బంది ఉండదని, అదేవిధంగా అర్హులైన బీసీ, ఎస్సి, ఎస్టీ కౌలు రైతుదారులకు రైతు భరోసా కూడా వర్తిస్తుందని తెలిపారు. నమోదుకు ఆయా గ్రామ సచివాలయాల గ్రామ రెవెన్యూ అధికారిని, రైతు భరోసా కేంద్రాలలో సంప్రదించాలని తెలిపారు. మండలంలో ఇప్పటివరకు 708 కౌలు రైతు గుర్తింపు కార్డులు అందజేసినట్లు ఏవో తెలిపారు. కౌలు రైతు గుర్తింపు కార్డులు కావలసినవారు పొలం యజమాని పాసుబుక్కు లేదా వన్ బి జిరాక్స్, పొలం యజమాని ఆధార్ జిరాక్స్, కౌలు రైతు ఆధార్ జిరాక్స్, కౌలు రైతు పాస్‌పోర్ట్ ఫొటో తీసుకురావాలని తెలిపారు.

విత్తన దుకాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

విత్తన దుకాణాలు తనిఖీ

ప్రజాశక్తి-పెద్దారవీడు

దర్శి సహాయ వ్యవసాయ సంచాలకుల ఆధ్వర్యంలో గురువారం పెద్దారవీడు మండలంలోని పలు విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా విత్తనాల దుకాణాల సర్టిఫికెట్లు, రిజిస్టర్లు తనిఖీ చేశారు. మండలంలోని ఒక షాపులో ప్రిన్సిపుల్ సర్టిఫికెట్లు లేనందువలన దర్శి సహాయ వ్యవసాయ సంచాలకులు రూ.37,810/- విలువగల సరుకులు స్టాప్ సేల్స్‌గా రాశారు. మండల వ్యవసాయ అధికారి కె బుజ్జిబాయి మాట్లాడుతూ మండలంలోని రైతులందరూ షాపులలో విత్తనాలు, పురుగు మందులు, బలం మందులు ఏవి కొన్నా కూడా బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని రైతులకు సూచించారు. ఎరువుల డీలర్లు రైతులకు బిల్లు ఇవ్వకుండా అమ్మకాలు జరిపిన లేదా నకిలీ విత్తనాలు పురుగు మందులు అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దర్శి సహాయ వ్యవసాయ సంచాలకులు కె బాలాజీనాయక్, పెద్దారవీడు మండల వ్యవసాయ అధికారినీ కె బుజ్జిబాయి, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం మంటగలిసిన వేళ..

కుటుంబ కలహాల నేపథ్యంలో..

తల్లిని చంపిన కుమారుడు

ప్రజాశక్తి-పంగులూరు

నవమాసాలు మోసి, కని, పెంచి పెద్దచేసిన కన్నతల్లిని కొడుకు చంపిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని రామకూరు గ్రామానికి చెందిన నార్నే సుబ్బులమ్మ(85)ను కుటుంబ కలహాల నేపథ్యంలో ఆమె కుమారుడు నార్ని శ్రీనివాసరావు గ్రామానికి దగ్గరలో నీటితో ఉన్న చిన్నమ్మ కుంటలో బుధవారం రాత్రి పడేశాడు. దీంతో సుబ్బులమ్మ మరణించింది. సుబ్బులమ్మకు ఒక కుమారుడు, కుమార్తె సంతానంగా ఉన్నారు. కుమార్తెను అద్దంకి మండలంలోని బొమ్మనంపాడు గ్రామంలో ఇచ్చి వివాహం చేసింది. కుమారుడు శ్రీనివాసరావుకు కూడా వివాహం చేసింది. అయితే కోడలికి, సుబ్బులమ్మకు ఎప్పుడూ సఖ్యత లేదు. తరచూ గొడవలు పడుతూ ఉండేవాళ్ళు. దీంతో సుబ్బులమ్మ కొంతకాలంగా కుమార్తె దగ్గర ఉంటోంది. నెల రోజుల క్రితం శ్రీనివాసరావు కుమార్తె పెళ్లి కోసం, తల్లి సుబ్బులమ్మను ఇంటికి తీసుకొచ్చాడు. ఇంటిలో సుబ్బులమ్మకు ఆమె కోడలికి తరచూ గొడవలు జరుగుతున్నాయి. మీ అమ్మ ఇంట్లో ఉంటే నేను ఇక్కడ ఉండనని శ్రీనివాసరావు భార్య తెగేసి చెప్పటంతో భార్య పెట్టే గొడవను భరించలేక శ్రీనివాసరావు తల్లిని వదిలించుకోవాలని నిర్ణయానికి వచ్చాడు. అనుకున్నదే తడవుగా శ్రీనివాసరావు తల్లి సుబ్బులమ్మను బుధవారం రాత్రి ఊరుకు సమీపంలో ఉన్న చిన్నమ్మ కుంటలో పడేసి ఇంటికి వచ్చాడు. గురువారం సాయంత్రం కుంటలో ఉన్న సుబ్బులమ్మ శవం పైకి తేలడంతో, సమాచారం అందుకున్న రేణింగవరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు.

సుబ్బులమ్మ మతదేహాన్ని పరిశీలిస్తున్న రేణింగవరం ఎస్ఐ తిరుపతిరావు

సుబ్బులమ్మ కుమారుడు శ్రీనివాసరావు తల్లి మరణంపై పొంతన లేని సమాధానం చెప్పటంతో, అనుమానం వచ్చిన పోలీసులు తమదైన శైలిలో విచారించారు. దీంతో శ్రీనివాసరావు పోలీసులకు అసలు జరిగిన విషయాన్ని చెప్పాడు. ఎస్ఐ తిరుపతిరావు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

షార్టు సర్క్యూట్‌తో బస్ దగ్ధం

ప్రజాశకి-జరుగుమల్లి

మండలంలోని జాతీయ రహదారి కె బిట్రగుంట వద్ద ఎన్ఎల్ 01బి1139 నంబరు గల మిజో ట్రావెల్ బస్ హైదరాబాదు నుంచి పాండిచ్చేరి వెళుతోంది. మండలంలోని కె బిట్రగుంట వద్దకు రాగా హైటెన్షన్ వైర్లు బస్సుకు తగలటంతో మంటలలో చిక్కుకొని పూర్తిగా దగ్ధం అయింది. మంటలు చెలరేగటంతో బస్ డ్రైవరు అప్రమత్తమై బస్సులో ప్రయాణిస్తున్న 25 మందికి పైగా వున్న ప్రయాణికులను సురక్షితంగా దించివేశారు. బస్‌లో ప్రయాణికుల లగేజీ పూర్తిగా కాలి పోయింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పి వేశారు. సంఘటనా స్థలానికి శింగరాయకొండ సిఐ రంగనాథ్, జరుగుమల్లి ఎస్ఐ వి వెంకటేశ్వరరావు చేరుకొని ప్రయాణికుల వివరాలు తెలుసుకున్నారు. జరుగుమల్లి ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బడుగు చిన్న వెంకటేశ్వర్లుకు నివాళి అర్పిస్తున్న ఉగ్ర నరసింహారెడ్డి తదితరులు

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

హనుమంతునిపాడు మండలం ముప్పల పాడు గ్రామంలో సిపిఎం నాయకులు బడుగు వెంకటేశ్వర్లు సోదరుడు బడుగు చిన్న వెంకటేశ్వర్లు గతవారంలో గుండె సంబంధిత వ్యాధితో మృతిచెందగా చిన్న వెంకటేశ్వర్లు దశదిన కర్మలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొని బడుగు చిన్న వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వేల్పుల రాజశేఖర్, కటికల వెంకటరత్నం, తెలుగు రైతు అధ్యక్షులు ఇంద్రభూపాల్‌రెడ్డి, ఎంఆర్‌పిఎస్ నాయకులు రవికుమార్ మాదిగ, చీకటి వెంకట సుబ్బయ్య, శ్యామల వెంకటేశ్వర్లు, కోటపాటి శేషయ్య, కొండెపోగు రాబర్ట్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి పందీటి మోహన్, ప్రధానోపాధ్యాయులు కుడారి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న ఎంపిపి చింతల శ్రీకృష్ణయ్య

వైసీపీ కార్యకర్త భూపతికి ఎంపిపి నివాళి

ప్రజాశక్తి-నగరం

మండలంలోని సిరిపూడి గ్రామంలో వైసీపీ కార్యకర్త, గృహ సారథి ఉప్పలపాటి భూపతి గురువారం మృతిచెందారు. భూపతి పార్థివ దేహానికి నగరం ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు అందజేసిన రూ.10 వేల రూపాయలను భూపతి కుటుంబ సభ్యులకు ఎంపీపీ అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

డ్వాక్రా సంఘాలను ఆర్థికంగా బలోపేతం యానిమేటర్లు కృషి చేయాలని డిఆర్‌డిఎ వైఎస్సార్ క్రాంతి పథం మార్కాపురం క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ సుధాకర్ తెలిపారు. గురువారం స్థానిక ఎస్సీ, బీసీ కాలనీలోని డ్వాక్రా బజార్లో మార్కాపురం, ఎర్రగొండపాలెం క్లస్టర్ పరిధిలోని డిఆర్‌డిఎ వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బందితో ఏసి సుధాకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని కోరారు. డ్వాక్రా మహిళలకు రుణాలు మంజూరు చేయించి వారికి స్వయం ఉపాధిపై అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి నెల డిఆర్డిఏ ద్వారా ప్రభుత్వం అందించే పథకాలలో ప్రతి గ్రామ సంఘం నుండి 100 శాతం ప్రోగ్రెస్ ఉండేలా చూసుకోవాలని కోరారు. ఎర్రగొండపాలెం క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు మొబైల్ బుక్ కీపింగ్‌లో ప్రతి గ్రామంలో ఏ గ్రేడ్‌లో ఉండే విధంగా పని చేయాలని కోరారు. ప్రతి సంఘ సభ్యురాలికి సంఘ ఆర్థిక లావాదేవీలపై పూర్తి అవగాహన కల్పించాలని కోరారు. స్త్రీ నిధి ఏజిఎం హర్షవర్ధన్ మాట్లాడుతూ ప్రతి గ్రామ సంఘంలోని సంఘాలలో స్త్రీ నిధి రికవరీ ప్రతి నెల 100 శాతం ఉండేలా సిబ్బంది పని చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఫైనాన్స్ డిపిఎం నరసింహారావు, ఉన్నతి డిపిఎం ప్రసాద్, హెచ్‌డిడిపి మాది శేషు, ఐబీడీపీఎం కృపారావు, గంటా శ్రీనివాసరావు, బ్యాంక్ లింకేజీ డీపీఎం సుబ్బారావు సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఏపీఎం రమేష్ బాబు, తర్లుపాడు ఏపీఎం పిచ్చయ్య, దోర్నాల ఏపిఎం పోలయ్య, పెద్దారవీడు ఎపిఎం శ్రీనివాసులు, వారితోపాటు మార్కాపురం, ఎర్రగొండపాలెం క్లస్టర్ పరిధిలోని అన్ని మండలాల ఏపీఎంలు, సీసీలు, వివోఏలు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌డిఎ వైఎస్సార్ క్రాంతి పథం ఏసి సుధాకర్

మృతి చెందిన శ్రీనివాసులు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-అద్దంకి

నాలుగు చక్రాల వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. వివరాల ప్రకారం.. మండలంలోని తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన వెంగలశెట్టి శ్రీనివాసులు(35) తిమ్మాయపాలెం గ్రామం నుంచి అద్దంకి వస్తున్న క్రమంలో అద్దంకి నుంచి దర్శి వైపు వెళ్తున్న నాలుగు చక్రాల వాహనం పట్టణంలోని కట్టకిందపాలెం సమీపంలో నాలుగు చక్రాల వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య జ్యోతి, కుమారుడు ఉన్నారు. సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

24న కలెక్టరేట్ వద్ద ధర్నా

జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల పిలుపు

ప్రజాశక్తి-సింగరాయకొండ

ఉపాధి హామీ కూలీల బకాయిల విడుదలకై ఈ నెల 24న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు గురువారం పిలుపునిచ్చారు. మండలంలోని శానంపూడిలోని ఉపాధి హామీ కూలీలు పని చేస్తున్న ప్రాంతంలో ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు గత 7 వారాలుగా చేసిన పనికి వేతనాలు ఇవ్వలేదన్నారు. రెక్కల కష్టం మీదనే ఆధారపడి జీవిస్తున్న కష్టజీవులకు వ్యవసాయ పనులు లేక, చేసిన ఉపాధి హామీ పనులకు డబ్బులు రాక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ సీజన్ జిల్లాలో ఇంకా రెండు నెలల తర్వాత మాత్రమే ప్రారంభమవుతుందని, అప్పటివరకు ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు.

నినాదాలు చేస్తున్న నాయకులు, ఉపాధి కూలీలు

ఇప్పటికే అనేక కుటుంబాలకు ప్రభుత్వం కేటాయించిన 100 రోజుల పని పూర్తి అయిందని, ఆ కుటుంబాలకు ఈ ఏడాది ఇక పనులు లభించవని అన్నారు. ఒక జాబుకార్డులో కుటుంబ సభ్యులు నలుగురు పేర్లు ఉంటే వారికి 25 రోజులు మాత్రమే పని లభిస్తుందన్నారు. ప్రభుత్వం ఇటువంటి కుటుంబాలకు మరో వంద రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న వారికి కూడా కేంద్ర ప్రభుత్వం సాంకేతికంగా చేసిన మార్పులతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. మస్టర్ షీట్లు ఇంగ్లీష్‌లో ఉండటం, ఇంటిపేరు లేకపోవడం, చేసిన పనిని ఫోనులో రెండుసార్లు ఫోటోలు తీసుకోవాలనడం లాంటి నిబంధనలు కూలీలకు చాలా ఇబ్బందిగా మారాయన్నారు. దీనితోపాటు ఇప్పటివరకు కూలీలకు కాస్త ఆసరాగా ఉన్న అనేక సౌకర్యాలను తొలగించారని, ఈ సమస్యల పరిష్కారానికై కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వి మోజస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న దృశ్యం

నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-కొల్లూరు

తోకలవానిపాలెం పంచాయతీ పరిధిలోని కృష్ణ నగర్ గ్రామానికి చెందిన గొరిపర్తి చిన్న సత్యనారాయణ జ్ఞాపకార్థం వారి కుమారులైన దిలీప్ కుమార్, ప్రదీప్ కుమార్ సుమారు 5000 రూపాయలు విలువచేసే నోట్ బుక్స్, పెన్సిళ్లు, జామెంట్రీ బాక్సులు విద్యార్థులకు అవసరమైన మెటీరియల్స్ ను పంపిణీ చేశారు. ఈ మెటీరియల్‌ను విద్యార్థులకు గ్రామ సర్పంచ్ టి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో దాతల తల్లి గొరిపర్తి ఉదయలక్ష్మి చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూలు హెడ్మాస్టర్ రాఘవేంద్రరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. ఈ విధంగా సహకరించిన కుటుంబ సభ్యులకు సర్పంచ్ కృష్ణమోహన్, స్కూల్ హెడ్‌మాస్టర్, గ్రామపెద్దలు అభినందనలు తెలియజేశారు.

సుప్రజను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పదిలో ప్రతిభ కనబర్చిన సుప్రజకు అభినందన

ప్రజాశక్తి-పర్చూరు

పదో తరగతిలో 593 మార్కులు సాధించి రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో నిలవటం అభినందనీయమని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కొనియాడారు. పర్చూరు నియోజకవర్గంలోని వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన రామకూరు గ్రామానికి చెందిన పోలిశెట్టి సుప్రజను ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సత్కరించారు. పర్చూరు అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో సుప్రజను అభినందించారు. ఎంబిబిఎస్ చదివి గైనకాలజిస్టుగా సేవలందించాలనేదే తన ధ్యేయమని సుప్రజ తెలిపారు. తెలుగుదేశం నాయకులు పంచుమర్తి అనురాధ, ఎంఎం కొండయ్య, వేగేశన నరేంద్రవర్మ, సలగల రాజశేఖర్ సుప్రజను అభినందించిన వారిలో ఉన్నారు.

కొండయ్యకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ఘనంగా కొండయ్య పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-పర్చూరు

తెలుగుదేశం పార్టీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.ఎం కొండయ్య పుట్టిన రోజు వేడుకలు పర్చూరులో ఘనంగా నిర్వహించారు. భవిష్యత్ భరోసా యాత్రలో భాగంగా గురువారం పర్చూరు వచ్చిన తెలుగుదేశం నాయకులు స్థానిక అభయాంజనేయస్వామి విగ్రహ ప్రాంగణంలో కేక్ ఏర్పాటు చేసి కొండయ్యతో కట్ చేయించారు. కొండయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పంచుమర్తి అనురాధ, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, బాపట్ల తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్కతో ఏటా ముంపునకు గురవుతున్నా..

గుణపాఠం నేర్వరా?

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ప్రతి ఏటా కురుస్తున్న వర్షాలకు నీరు బయటకు వెళ్లే మార్గం లేక వందలాది ఎకరాలు ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోతున్నా అధికారులు గుణపాఠాలు నేర్వడం లేదు. భట్టిప్రోలులోని అద్దేపల్లి చావలి రోడ్డు నుంచి ప్రారంభమైన కనగాల అప్లూయంట్ మురుగు కాలువ సుమారు ఏడు కిలోమీటర్లు ప్రయాణించి చెరుకుపల్లి మండలం గూడవల్లి గంగోలుగా పిలువబడే పెద్ద మురుగు కాలువలో కలుస్తుంది. ఈ కాలువ గత కొన్నేళ్లుగా గుఱ్ఱపుడెక్కతో పూడిపోయిఉంది. దీంతో మురుగు పారుదల జరగక అధిక వర్షాల సమయంలో కాలువ వెంబడి వందలాది ఎకరాల మాగాణి పొలాల్లోకి నీరు

డ్రైన్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్క

ఎగతట్టుతోంది. ముంపునకు గురై రోజుల తరబడి వరి పొలాల్లో నీరు నిల్వ ఉండి పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. దీని కారణంగా అద్దేపల్లి, ఐలవరం, కనగాల గ్రామాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం ఎప్పటికప్పుడు మురుగు కాలువల అభివృద్ధికి చర్యలు చేపడతామని చెప్పినా కనీస చర్యలు లేవని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మరో కొద్ది రోజులలో ఖరీఫ్ సీజన్‌కు రైతులు శ్రీకారం చుట్టనున్నారు. కనీసం గుఱ్ఱపుడెక్కకు గడ్డి మందును పిచికారీ చేసినా గుఱ్ఱపుడెక్క చనిపోయి ఉండేదని, పూడికతీత చేపట్టకపోయినా గడ్డి మందు పిచికారీకైనా చర్యలు చేపట్టాలని ఆ ప్రాంత రైతులు కోరుతున్నారు.



అమర్నాథ్ హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని డిప్యూటీ తహశీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు

నిందితులను శిక్షించాలని ఎస్ఎఫ్ఐ ర్యాలీ

ప్రజాశక్తి-చెరుకుపల్లి

జస్టిస్ వర్మ సిఫార్సుల ప్రకారం నిందితులను 45 రోజులలో కఠినంగా శిక్షించాలని, విద్యార్థులు, మహిళల రక్షణకు ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి మనోజ్ కుమార్ డిమాండ్ చేశారు. ఉప్పాల అమర్నాథ్‌పై పెట్రోలు పోసి హతమార్చిన నేపథ్యంలో గురువారం చెరుకుపల్లిలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తహశీల్దారు కార్యాలయం, పోలీస్ స్టేషన్ వద్ద వినతిపత్రం అందజేశారు. మహిళలు, విద్యార్థుల రక్షణకు ప్రత్యేక కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, జస్టిస్ వర్మ సిఫార్సుల మేరకు ఇటువంటి కేసులలో నిందితులకు వెంటనే కఠినంగా శిక్ష పడే విధంగా 45 రోజులలో శిక్షించేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరపాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. అమర్నాథ్ సోదరి విద్యాభ్యాసానికి ప్రభుత్వమే చొరవ తీసుకొని చదివించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, తదితర డిమాండ్లు చేస్తూ విద్యార్థులు నినాదాలు చేస్తూ ఐలాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి సిఐటియు జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్, కే శరత్ తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పలు పాఠశాలలు, కళాశాల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

నర్సరీలకు లైసెన్స్‌లు తప్పనిసరి

ఉద్యాన అధికారి పి జెన్నెమ్మ

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

జిల్లాలో నర్సరీలు నిర్వహిస్తూ నారు ఉత్పత్తి చేస్తున్న ప్రతి ఒక్కరూ 2010 నర్సరీ చట్టం ప్రకారం ఉద్యాన శాఖ ద్వారా లైసెన్సులు తప్పనిసరిగా తీసుకోవాలని బాపట్ల జిల్లా ఉద్యాన అధికారి పి జెన్నెమ్మ తెలిపారు. గురువారం మండల కేంద్రం మార్టూరులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నర్సరీ యజమానులకు వాటి నిర్వహణపై అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సరీ యజమానులకు జిల్లా ఉద్యాన అధికారి పలు సూచనలు చేశారు. నారు పెంపకంలో జాగ్రత్తలు పాటిస్తూ నాణ్యమైన నారుని రైతులకు అందించాలని సూచించారు. రైతులు తెచ్చి పెంచుకునే సొంత విత్తనాలకు, నర్సరీ యజమాని తెచ్చి పెంచుకునే విత్తనాలకు సంబంధించి విడివిడిగా బిల్లులు ఇవ్వాలని తెలిపారు. అనంతరం మార్టూరు వ్యవసాయ సహాయకులు కెవి శ్రీనివాసరావు మాట్లాడుతూ నర్సరీ యజమాని తప్పనిసరిగా రికార్డ్స్ నిర్వహించి వాటిలో ఎంత విత్తనం కొనుగోలు చేసింది, ఎంత విత్తనం నారు పోసింది ఆయా రిజిస్టర్లలో తప్పనిసరిగా నమోదు చేయాలని అన్నారు. ప్రతి నర్సరీ యజమాని రిజిస్ట్రేషన్ కోసం ఉద్యాన శాఖ అధికారుల వద్ద ఉన్న దరఖాస్తు తీసుకొని రూ.1,000 చలానా తీసుకొని తమ వద్ద ఉన్న పట్టాదారు, లీజు కాపీ పాసు పుస్తకం నకలు, కౌలు ఖరారునామాతో నర్సరీ నమూనాతో భూసార, నీటి పరీక్షలు చేయించిన పత్రాలు తీసుకొని దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్టూరు, పర్చూరు, అద్దంకి, బల్లికురవ, కొరిశపాడు, జె పంగులూరు ఉద్యాన, వ్యవసాయ అధికారులు బాణావత్ హనుమంత్ నాయక్, డి రవిప్రకాష్ బాబు, దీప్తి, వీరగంధం కిరణ్ కుమార్, ఎస్ కుమారి, పాలపర్తి శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి నర్సరీ యజమానులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉద్యాన అధికారి పి జెన్నెమ్మ

కదం తొక్కిన తెలుగు తమ్ముళ్లు

కిక్కిరిసిన రహదారులు ● పసుపుమయమైన పర్చూరు-కారంచేడు ● అడుగడుగునా జననీరాజనం

ప్రజాశక్తి-పర్చూరు

తెలుగుదేశం పార్టీ మినీ మేనిఫెస్టో భవిష్యత్తు గ్యారంటీ చైతన్య రథయాత్ర సందర్భంగా పర్చూరులో పసుపు సైనికులు కదం తొక్కారు. గురువారం పర్చూరు నియోజకవర్గంలో సాగిన యాత్రకు ప్రజలు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అడుగునడునా బ్రహ్మరథం పట్టారు. కారంచేడు వద్ద మహిళలు హారతులతో చైతన్య యాత్ర బస్సుకు దిష్టి తీసి హారతులు ఇచ్చారు. పర్చూరు చైతన్య రథయాత్రకు 300 ట్రాక్టర్లతో అన్నదాతలు అగ్రభాగాన నిలిచారు. జై తెలుగుదేశం, జై జై తెలుగుదేశం, జై చంద్రబాబు, జై ఏలూరి అంటూ అంటూ యువత వెయ్యి బైకులతో ర్యాలీలో పాల్గొన్నారు. 100 కార్లతో రోడ్లన్నీ కిక్కిరిశాయి. పర్చూరులో తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడూరి బ్రహ్మాచారి కుటుంబ సభ్యులు మంగళ వాయిద్యాలతో యాత్రకు స్వాగతం పలికి హారతులు ఇచ్చారు. పర్చూరులో రెండు కోట్ల రూపాయల నిధులతో టిడిపి హయాంలో నిర్మించిన క్రీడా ప్రాంగణం వద్ద ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ సెల్ఫీ దిగి ప్రభుత్వానికి ఛాలెంజ్ విసిరారు. అనంతరం బొమ్మల

సెంటర్లోని ఎన్టీఆర్, అంబేద్కర్, రంగా విగ్రహాలకు పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం 95 అడుగుల అభయాంజనేయ స్వామి యాత్ర బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు తెలుగుదేశం పార్టీ నేతలను పూలమాల శాలువాతో సన్మానించారు. పసుపు పూలతో పర్చూరు పులకించింది. అనంతరం అసంపూర్తిగా ఉన్న పర్చూరు వాగును పరిశీలించారు. బొమ్మల సెంటర్లో కరపత్రాలు పంపిణీ చేశారు.

ఇది దందాల ప్రభుత్వం: ఏలూరి

రాష్ట్రంలో అక్రమ దందాలు, దౌర్జన్యాలతో వైసిపి పాలన సాగుతోందని బాపట్ల జిల్లా పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మండిపడ్డారు. దాతల సహకారంతో స్థలాన్ని సమకూర్చి రెండు కోట్ల రూపాయల నిధులు వెచ్చించి క్రీడా ప్రాంగణాన్ని నిర్మిస్తే తమ పేరు వేయవలసి వస్తుందని ఆ ప్రాంగణాన్ని ఇప్పటివరకు ప్రారంభోత్సవం చేయలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ప్రాంగణాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దుతామని పర్చూరు క్రీడాకారులకు భరోసా ఇచ్చారు.. అనంతరం బొమ్మల కూడలిలో ఉన్న ఎన్టీఆర్, వంగవీటి రంగా, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ర్యాలీలో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మాజీ ఎంపి శ్రీరామ్ మాల్యాద్రి, చీరాల ఇంచార్జ్ ఎంఎం కొండయ్య, బాపట్ల ఇంచార్జ్ నరేంద్రవర్మ, సలగల రాజశేఖర్‌బాబు, పర్చూరు మండల అధ్యక్షుడు షంషుద్దీన్, ఇంకొల్లు అధ్యక్షుడు హనుమంతరావు, కారంచేడు అధ్యక్షుడు శ్రీహరి, యద్దనపూడి మండల అధ్యక్షుడు రంగయ్య, చినగంజాం మండల అధ్యక్షుడు పొద వీరయ్య, మార్టూరు మండల అధ్యక్షుడు తాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పసుపుగల్లు విఎఒ సస్పెన్షన్

ప్రజాశక్తి-ముండ్లమూరు

మండలంలోని పసుపుగల్లు గ్రామంలో ఆర్‌బికెలో విఎఒగా పనిచేస్తున్న రామావత్ స్వాతీబాయిని కలెక్టర్ ఆదేశాల మేరకు ఎడిఎ శ్రీనివాసరావు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను మండల వ్యవసాయ కార్యాలయానికి పంపినట్లు ఏఓ ఎండి ఫరూక్ తెలిపారు. పసుపుగల్లు గ్రామంలో 2021 ఖరీఫ్ పంటల బీమా నమోదులో అవినీతి అక్రమాలకు పాల్పడి అనర్హులైన నలుగురు రైతులకు రూ.4.82 లక్షల రూపాయలను జమ చేయడం జరిగిందని తెలిపారు. గ్రామంకు చెందిన అర్హులైన నలుగురు రైతులు పంటల బీమా నగదు పడలేదని వ్యవసాయ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో విఎఎ స్వాతీభాయ్‌పై విచారణ చేపట్టారు. అవినీతి రుజువు కావడంతో కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఏడిఎ సస్పెండ్ చేసినట్లు ఏఓ తెలిపారు.

గడువు పొడిగించాలి

ఏపీ చేనేత కార్మిక సంఘం

ప్రజాశక్తి-చీరాల

నేతన్న నేస్తం మూడో విడత పథకానికి దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులకు నిబంధనలు తడలించి దరఖాస్తు గడువును పొడిగించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం, ఆంధ్రప్రదేశ్ చేతివత్తుల సమన్వయ కమిటీ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మాస్టర్ వీవర్ల వద్ద లెటర్ ప్యాడ్, పాస్ బుక్కులు తీసుకురావాలని నిబంధన పెట్టడం, ఆరు నెలల పాటు జీఎస్టీ బిల్లులు జత చేయాలనడం కార్మికులకు ఆచరణలో సాధ్యం కాదని పేర్కొన్నారు. నేతన్న నేస్తం మొదటి విడతలో చేనేత గుర్తింపు కార్డుల ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేసిన తరహాలోనే మూడో విడత దరఖాస్తులను అనుమతించాలని కోరారు. ఆచరణ సాధ్యం కానీ నిబంధనలు విధించడం లబ్ధిదారుల సంఖ్య తగ్గించడంలో భాగమేనని ఆరోపించారు. గతంలోగా చేనేత కార్మికులందరికీ నేతన్న నేస్తం వర్తింపజేయాలని, దరఖాస్తు గడువును మరో వారం రోజులు పొడిగించాలని చేతివత్తుల సమన్వయ కమిటీ కన్వీనర్ పి కొండయ్య, చేనేత కార్మిక సంఘం నాయకులు ఎర్రం రాధా, గద్దె బాబు, ఐవి ప్రసాద్, బూదాటి వెంకటకుమార్, శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

ఓటర్ల జాబితాను సవరించాలి

ప్రజాశక్తి-దరిశి

ఓటర్ల జాబితాను సవరించాలని నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎన్ఎన్ఎస్ లోకేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎలక్ట్రోరల్ సమీకరణ, ఓటర్ల జాబితా సవరణపై బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లతో ఎన్నికల డిప్యూటీ తహశీల్దారు దేవప్రసాద్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు రవిశంకర్, విఆర్‌ఒలు, బిఎల్‌ఒలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఉద్యాన అధికారిగా రవిబాబు

ప్రజాశక్తి-దరిశి

దరిశి మండలం నూతన ఉద్యాన అధికారిగా ఎన్. రవిబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జిగా బాధ్యతలు వ్యవహరిస్తున్న ఆదిరెడ్డి స్థానంలో రవిబాబు బాధ్యతలు తీసుకున్నారు. రవిబాబు దరిశి, ముండ్లమూరు, తాళ్ళూరు మండలాలకు ఉద్యాన అధికారిగా వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఆయనను పలువురు అభినందించారు.

1 నుంచి ఉచితంగా ధృవీకరణ పత్రాలు

ప్రజాశక్తి-దరిశి

వచ్చే నెల 1వ తేదీ నుండి గ్రామాలలో 9 రకాల ధృవీకరణపత్రాలు ఉచితంగా ఇవ్వనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి కె కుసుమకుమారి తెలిపారు. దరిశి కాకుండా మిగిలిన 18 గ్రామ సచివాలయాల పరిధిలో వచ్చేనెల 19వ తేదివరకు ఆయా గ్రామాల వారీగా తేదీలు ప్రకటించారు. ఆ తేదీలలో గ్రామాలలో ధృవీకరణపత్రాలు ఉచితంగా పొందవచ్చునన్నారు.

మెళకువలు నేర్చుకోవాలి

ప్రకాశం-దరిశి

పాడి పశువుల పెంపకంలో మెళకువలు నేర్చుకోవాలని కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త డాక్టరు లీలాకృష్ణ అన్నారు. గురువారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో ఆయన పాడిరైతులకు పాడి పశువుల పెంపకంపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో బైస్తో సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటరు పివి ప్రసాద్ పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో అరుదైన చికిత్స

విజయవంతంగా 'లాగోఫ్తాల్మోస్' ఆపరేషన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మరో అరుదైన చికిత్స జరిగింది. కనురెప్పలు పూర్తిగా మూసుకోలేకపోవడం 'లాగోఫ్తాల్మోస్' (కనురెప్పలు మూసుకుపోవడం) లాంటి సమస్య సహజంగా లెప్రసి వ్యాధి సోకిన వారికి వస్తుంది. దీని వల్ల క్రమేపీ కంటి నరాలు దెబ్బతింటాయి. తాళ్లూరు, బొద్దికూరపాడుకు చెందిన మందా అదెయ్య గత ఐదు సంవత్సరాలుగా లెప్రసి వ్యాధికి చికిత్స పొందుతూ వున్నారు. అయితే దీని ప్రభావంతో అదెయ్యకు కనురెప్పలు పూర్తిగా మూసుకోలేకపోవడం లాంటి సమస్య ఎదురైంది. దీంతో జిజిహెచ్ వైద్యులు 'లాగోఫ్తాల్మోస్'గా దీనిని గుర్తించారు. జిజిహెచ్ ప్లాస్టిక్ సర్జరీ విభాగం వైద్యులు దీనికి పూర్తిస్థాయి చికిత్స చెయ్యాలని నిర్ణయించారు. డాక్టర్ స్ఫూర్తి ఆధ్వర్యంలో విజయవంతంగా చికిత్స నిర్వహించారు. కంటి కండరాలని సరిచెయ్యడంలో భాగంగా అదెయ్య చేతి కండరాలను కంటికి సరిపోయేలా చికిత్స నిర్వహించారు. గతంలో ఇలాంటి చికిత్స కోసం గుంటూరు పంపించే వాళ్ళమని జిజిహెచ్ సూపరింటెండెంట్ ప్రోత్సాహంతో జిజిహెచ్ ఒంగోలులోనే చికిత్స పూర్తి చేశామని ప్లాస్టిక్ సర్జరీ నిపుణురాలు డాక్టర్ స్ఫూర్తి సంగణబోయిన అన్నారు.

వైద్యబృందాన్ని అభినందిస్తున్న సూపరింటెండెంట్ భగవాన్‌నాయక్

వైద్యసిబ్బందికి అభినందనలు

అదెయ్యని గురువారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్‌నాయక్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బాలాజీనాయక్, హెచ్ఒడి డాక్టర్ రజనీ అదెయ్యని కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అదెయ్యకి రూ.12 వేల రూపాయలు ఇంటెన్సివ్‌ను కూడా అందిస్తోందని తెలిపారు. అధునాతన వైద్య సేవలు, నిబద్ధత కలిగిన వైద్య బృందం వల్ల ఇలాంటి అరుదైన చికిత్స సాధ్యం అవుతుందని డాక్టర్ భగవాన్ నాయక్ అన్నారు. వైద్య సిబ్బందికి జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ రమేష్‌కుమార్ అభినందనలు తెలిపారు.

పట్టణ నిరాశ్రయుల భవనం ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

స్థానిక రిమ్స్ వైద్యశాల ఆవరణలో రూ.1.49 కోట్ల వ్యయంతో నిర్మించిన పట్టణ నిరాశ్రయుల భవనం, వన్‌స్టాప్ సెంటర్‌ను స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నగరానికి వివిధ పనుల మీద వచ్చేవారు, పట్టణంలో నారాశ్రయులుగా ఉన్న వారికి నిరాశ్రయుల భవనం, వన్‌స్టాప్ సెంటర్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ప్రధానంగా రిమ్స్ వైద్యశాలకు వచ్చేవారికి ఈ సెంటర్‌లు ఉపయోగపడతాయని చెప్పారు. రెడ్ క్రాస్ సొసైటీ ఈ భవనాలను నిర్వహణ బాధ్యతలను చూస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగా సుజాత, మెప్మా పీడి టి రవికుమార్, డిఆర్‌డిఎ పీడి బాబురావు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం వెంకటేశ్వర రావు, ఇండియాన్ రెడ్‌క్రాస్ సొసైటి చైర్మన్ ప్రకాశ్‌బాబు, ఆర్ ఎం. చైతన్యవర్మ, కార్పొరేటర్‌లు ఈదర వెంకట సురేష్‌బాబు, యనమల నాగరాజు, వైసిపి నేత కటారి శంకర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభం

స్థానిక అద్దంకి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ ఎదురుగా ఏర్పాటు చేసిన జగనన్న ఈమార్ట్‌లలో ప్రదర్శన, అమ్మకాలను స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి గురువారం ప్రారంభించారు. మహిళలు తయారు చేసి విక్రయిస్తున్న వివిధ రకాల ఉత్పత్తులను ఎమ్మెల్యే పరిశీలించి, వారిని అభినందించారు. కొన్ని వస్తువులను ఆయన స్వయంగా కొనుగోలు చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, మెప్మా పీడి టి రవికుమార్, కమిషనర్ వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ, మెప్మా సిటి మిషన్ మేనేజర్ కొండయ్య పాల్గొన్నారు.

'ఉపాధి' చట్టం రక్షణకు ఉద్యమిద్దాం..

- 24 కలెక్టరేట్ వద్ద ధర్నాకు తరలిరండి
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఉపాధి హామీ చట్టం పరిరక్షణ కోసం, కూలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నెరుసుల వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులు తెలియజేశారు. స్థానిక సంఘం జిల్లా కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ గ్రామీణ పేదల జీవితాల్లో మౌలిక మార్పులు తెచ్చిందన్నారు. దీనిని మరింత మెరుగుపరిచి పేదరిక నిర్మూలన, వలసల నివారణ చేపట్టాల్సిన కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసే కుట్రలకు పాల్పడుతుందని విమర్శించారు. బడ్జెట్‌లో నిధులు తగ్గించడంతోపాటు, కూలీలకు వ్యతిరేకంగా చట్టంలో మార్పులు చేస్తున్నారని మండిపడ్డారు. ఒకవైపు ప్రభుత్వ రంగ సంస్థలు ప్రకతి వనరులన్నీ సంపన్నులకు దోచిపెడుతున్న మోడీ ప్రభుత్వం సామాన్యులకు అనుకూలంగా ఉన్న చట్టాలను సవరించటం అమానుషమన్నారు. కూలీలకు గత 7 వారాలుగా చేసిన పనికి వేతనాలు ఇవ్వలేదన్నారు. ఒక జాబ్ కార్డులో కుటుంబ సభ్యులు నలుగురు పేర్లు ఉంటే వారికి 25 రోజులు మాత్రమే పని లభిస్తుందన్నారు. ప్రభుత్వం ఇటువంటి కుటుంబాలకు మరో వంద రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న వారికి కూడా కేంద్ర ప్రభుత్వం సాంకేతికంగా చేసిన మార్పులతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కంకణాల వెంకటేశ్వర్లు, జి.రవికుమార్ పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ముక్తినూతలపాడు సచివాలయం తనిఖీ

ఎమినిటీస్ సెక్రటరీపై చర్యలకు కమిషనర్ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగరంలోని రెండో డివిజన్ ముక్తినూతలపాడు సచివాలయాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల హాజరు పట్టికలను పరిశీలించారు. గత వారం రోజులుగా ముందస్తు అనుమతి లేకుండా విధులకు హాజరు కాని ఎమినిటీస్ సెక్రటరీపై చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ ఇంజినీర్‌ను ఆదేశించారు. ఇంటిపన్నుల వసూలు విషయంలో సచివాలయం వెనుకబడి ఉన్నందున సచివాలయ అడ్మిన్‌కు షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఆదేశించారు. సచివాలయం పరిధిలో జరుగుతున్న వివిధ రకాల సర్వేల గురించి అడిగితెలుసుకున్నారు. సర్వేలకు సహకరించని వాలంటీర్లను ఎందుకు విధుల నుంచి తొలగించకూడదో రాతపూర్వకంగా తెలియజేయాలని నోటీసులు ఇవ్వాలని సూచించారు. వాలంటీర్లు అంతా సచివాలయ సిబ్బందితో కలిసి సర్వేలలో భాగస్వామ్యులు కావాలని, సర్వేలు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కమిషనర్ వెంట అసిస్టెంట్ సిటి ప్లానర్ కె వెంకటేశ్వర్లు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ శివప్రసాద్, తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

గడపగడపకూలో ఇన్‌ఛార్జి వరికూటి

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమం అని కొండపి నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు అన్నారు. గురువారం మండలంలోని పొందూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో వైసీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షులు చింతపల్లి హరిబాబు, తహశీల్దార్ కొల్లిబోయిన సంజీవరావు, ఎంపీడీఓ పి రత్నజ్యోతి, ఏపిఎం ఎం హనుమంతరావు, గ్రామ నాయకులు ఏలూరి వంశీకష్ణ, వైసిపి నాయకులు ఉన్నారు.

ఎంఇఒ-2కు ఘనసత్కారం

ప్రజాశక్తి-శింగరాయకొండ

సింగరాయకొండ ఎంఇఓ-2గా బాధ్యతలు చేపట్టిన ఆవుల శ్రీనివాసరావుకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కారం చేశారు. ఎంఇఓ-2గా నియమించడంతో ఆయన బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో యుటిఎఫ్ నాయకులు కలిసి సమస్యలను వివరించి, ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఇఒ బి.శివన్నారాయణ, యూటీఎఫ్ జిల్లా నాయకులు కేశవరాజు, కొల్లూరు వెంకయ్య, మనోహర్, సుధాకర్‌రెడ్డి, ఎం.మల్లికార్జున, కష్ణకుమారి, ఆర్.కళ్యాణి, బి.శ్రీనివాసరెడ్డి, వై.రంగయ్య, ఎస్.సునీల్‌కుమార్‌రెడ్డి, ఆంజనేయులు, జె.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

50 క్వింటాళ్ల వరకు అనుమతివ్వాలి..

బోర్డు అధికారులకు ఫ్లోర్ కమిటీ సభ్యుల విజ్ఞప్తి

ప్రజాశక్తి-టంగుటూరు

పొగాకు సాగులో పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోయాయని, రైతులకు గిట్టుబాటు ధర లభించాలంటే ఒక్కో బ్యారన్ కు 45 నుండి 50 క్వింటాళ్ల వరకు అనుమతి ఇవ్వాలని ఫ్లోర్ కమిటీ నాయకులు పొగాకు బోర్డు అధికారులకు విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక కొండపి రోడ్డులోని పొగాకు బోర్డులో ఫ్లోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్ఎం లక్ష్మణ రావు మాట్లాడుతూ 2023 - 24 పంట కాలానికి సంబంధించి అధికారిక పొగాకు సాగును నిర్ణయించేందుకు సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అత్యధిక ధర రూ.245లు, అత్యల్ప ధర రూ.160లుగా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు నాయకులు పోతుల నరసింహారావు, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, బోర్డు ఎస్ జి ఓ జి సునీల్ కుమార్, పొగాకు రైతులు తదితరులు పాల్గొన్నారు.

భాస్కరశాస్త్రిని పరామర్శిస్తున్న దామచర్ల సత్య

'జంధ్యాల'ను పరామర్శించిన సత్య

ప్రజాశక్తి-జరుగుమల్లి

మండలంలోని నరసింగోలు గ్రామంలోని శ్రీ గంగా పార్వతి సమేత రామ లింగేశ్వరస్వామి దేవాలయ ప్రధాన అర్చకులు జంధ్యాల చంద్ర భాస్కరశాస్త్రి ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ఈ సమాచారం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య గురువారం జంధ్యాలను పరామర్శించారు. వీరి వెంట ఆ గ్రామ మాజీ సర్పంచ్ పాతూరి కోటేశ్వరరావు, టిడిపి నాయకులు మండవ మల్లికార్జున, పలువురు గ్రామస్తులు ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-జరుగుమల్లి

జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్‌బిఐ నేతృత్వంలో ఆర్థిక అక్షరాస్యత మీద క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ క్విజ్ పోటీలలో జరుగుమల్లి, కామేపల్లి, చిరికూరపాడు, కె.బిట్రగుంట, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు 8వ తరగతి నుంచి 10 వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. బహుమతులను జరుగుమల్లి కెనరా బ్యాంకు మేనేజరు కట్టా శివయ్య అంద జేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బత్తుల నాగేంద్ర వదన్, రెండో ఎంఇఒ డోలా శ్రీనివాసరావు, జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యులు ఎం.శ్రీనివాసరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నోట్‌పుస్తకాల పంపిణీ అభినందనీయం

ప్రజాశక్తి-దర్శి

ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమని హెచ్ఎం కేతు శ్రీనివాసులురెడ్డి అన్నారు. గురువారం సుచ్చుపాద ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రకాశం జిల్లా జనాభా లెక్కల అధికారి దిద్దుకూరి రామసుబ్బారావు ఆర్థిక సహాయంతో నోటు పుస్తకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కెవి కృష్ణారావు, సిహెచ్ నిర్మల, ఎన్ కామాక్షి, జి.మాలిని పాల్గొన్నారు.

'ప్రైవేటు'కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని జిల్లా ఉప విద్యాధికారి చంద్రమౌళీశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక ఎంఇఒ కార్యాలయంలో ఎంఇఒ గుర్రం పెద్దిరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొత్తగా నియమితులైన ఎంఇఒ-2 శ్రీరామ్ రమణయ్య పరిచయ వేదిక కార్యక్రమంలో పాల్గొని ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

శ్రీసాయి వివేక అకాడమీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పిసిపల్లి

శ్రీసాయి వివేక ఎడ్యుకేషనల్ అకాడమిలో శిక్షణ తీసుకున్న టి.సంజన(కొత్తపల్లి), కె.మధుప్రియా(ఎంపిపిఎస్ పెదవరిమడుగు), సిహెచ్.జశ్వంత్(ఎంపిపి పెదవరిమడుగు), సిహెచ్.నక్షత్ర(ఎంపిపిఎస్ నేరేడుపల్లి)లు నవోదయ పాఠశాలకు ఎంపికయ్యారు. పెదవరిమడుగుకు చెందిన కరణం మైథిలి ఇంటర్మీడియట్ గురుకుల మరియు ఎపిఆర్‌జెసిలకు ఎంపికయ్యారు. టి.గణేష్, వరుణ్‌సాయిలు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారు. స్వర్ణ రేవంత్‌సాయి సైనిక స్కూల్‌కు ఎంపికైనట్లు నిర్వాహకులు వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు శ్రీసాయి వివేక ఎడ్యుకేషనల్ అకాడమి సిబ్బంది, పెదవరిమడుగు యుపి స్కూల్ ప్రధానోపాధ్యాయులు స్వర్ణ రమణయ్య, యుటిఎఫ్ నాయకులు, ఎస్.కె.గౌస్‌బాషా అభినందించారు.

'సురక్ష'లో అందరూ భాగస్వాములు కావాలి

సచివాలయాలను తనిఖీ చేసిన జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి

ప్రజాశక్తి-చీమకుర్తి

జగనన్న సురక్ష కార్యక్రమంలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లివెంకాయమ్మ పేర్కొన్నారు. గురువారం ఆమె స్థానిక ఒకటి, ఎనిమిది వార్డులలోని సచివాలయాలలో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సచివాలయ సిబ్బంది వివరాలు, పనివిధానం, పథకాల అమలులో జరుగుతున్న జాప్యం, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటింటికీ తీసుకెళ్ళాలన్నారు. శుక్రవారం నుంచి జగనన్న సురక్ష కార్యక్రమంపై శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. మొత్తం సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ల వ్యవస్థ, గృహసారథులు అందరూ ఇంటింటికి తిరిగి అర్హులై ఉండి పథకాలకు దూరంగా ఉన్న వారిని గుర్తించాలన్నారు. అర్హులైన వారందరికీ పథకాలు వర్తించేలా చేయాలన్నారు. సమస్యలుంటే సురక్ష కార్యక్రమం ద్వారా పరిష్క రించాలన్నారు. మండలాధికారులు కూడా షెడ్యూలు ప్రకారం సచివాలయాలకు వెళతారన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికి అందేలా సమన్వయంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పిన్నిక మధుసూదనరావు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ బావతు వెంకటరెడ్డి, కమిషనర్ ఎస్‌కె ఫజులుల్లా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న బూచేపల్లి వెంకాయమ్మ

అర్హులందరికీ భూములు పంచాలి

ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

అర్హత కలిగిన పేదలందరికీ వ్యవసాయ సాగు భూములను పంపిణ చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి కోరారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట పలువురు పేదలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గాలి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ అనర్హులు ఎందరో ప్రభుత్వ భూము లను సొంతం చేసుకున్నారన్నారు. ధనవంతుల చేతుల్లో ఉన్న అసైన్డ్ భూముల హక్కులను రద్దు చేయాలని, పేదలకు పంపిణీ చేయాలని కోరారు. మార్కాపురం మండలంలోని రాయవరం గ్రామ పరిధిలో ప్రభుత్వ భూములను పెద్దలు కాజేశారన్నారు. పెద్దలకు భూములు కట్టబెట్టిన విఆర్‌ఓను సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. భూములు మాత్రం పెద్దల చేతుల్లోనే ఉన్నాయన్నారు. ఆ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్లు 102, 103, 140, 342, 344, 348, 366, 365, 398లలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైనట్లు ఆరోపించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాల యంలో ఆ గ్రామస్తులతో కలిసి వినతిపత్రాన్ని అందించారు.

ధర్నాలో మాట్లాడుతున్న గాలి వెంకటరామిరెడ్డి

విద్యుత్ ఛార్జీలు తగ్గించాల్సిందే..

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

విద్యుత్ ఛార్జీలు తగ్గించి, మోటార్లకు మీటర్లు బిగించే విధానాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఐ యర్రగొండపాలెం నియోజక వర్గ కార్యదర్శి దేవెండ్ల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం యర్రగొండపాలెంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం దేవెండ్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి మెడబలిమి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు బీమిశెట్టి వెంకటేశ్వర్లు, బిఎస్పీ పార్టీ నాయకులు రాచీటి ప్రసాద్, బీసీ సంఘం నాయకులు గజ్జ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు చెవుల అంజయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షులు మస్తాన్‌వలి, సీపీఎం నాయకులు టంగుటూరి సత్యనారా యణ, షేక్ అమీర్‌బాషా, సీపీఐ నాయకులు నక్కా తిరుపతయ్య, మొగిలి వెంకటేశ్వర్లు, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

అధిక ఫీజులను అరికట్టాలని ధర్నా

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం కేంద్రంగా నిర్వహణలో ఉన్న ప్రైవేటు విద్యాసంస్థల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజులను అరికట్టాలని స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా జరిగింది. బహుజన సైన్యం అధ్యక్షులు జనమాల నాగయ్య అధ్యక్షతన ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం అమలు చేయడం లేదన్నారు. కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజులు నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేయడం జరుగుతోందని ఆరోపించారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు ఫీజుల పేరుతో దోచుకుంటున్నాయన్నారు. ఎల్‌కెజిలో రూ. 12,500/- నుంచి రూ. 40వేల వరకు వసూలు చేస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు తక్షణమే ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, ఆ దిశగా ఆదేశించాలని మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో జె.చిన్నబాలు, జోసఫ్, ఎస్.సుబ్బయ్య, ఆర్.తిమోతి, ఎ.రామంజి పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు అందజేస్తున్న కుంచాల అంజమ్మ

పేద విద్యార్థులకు నోటుపుస్తకాలు అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు

పేద విద్యార్థులకు నోటు పుస్తకాలను కుంచాల దానామూర్తి సతీమణి అంజమ్మ ఒంగోలులోని వారి నివాసంలో గురువారం అందజేశారు. మొత్తం 23 మందికి అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అంజమ్మకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

రక్తహీనతపై అవగాహన

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో గురువారం కిశోర బాలికలకు అంగన్‌వాడీ ఆధ్వర్యంలో రక్తహీనతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దిపాడు సెక్టార్ సిడిపిఒ ఇవాంజిలిన్ మాట్లాడుతూ చిన్నారుల వికాసమే అంగన్‌వాడీల లక్ష్యమన్నారు. వ్యక్తిగత వికాసానికి అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో దోహదపడతాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ కిరణ్, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన కొంజేటి జలంధర్ పుట్టినరోజు సందర్భంగా పంచాయతీ కార్మికులు, వారి పిల్లలకు దుస్తులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫార్మాసిస్ట్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రత్నాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ ఇంటర్ నేషనల్ ఉపాధ్యక్షులు కొంజేటి వెంకటసురేష్‌బాబు, అమరా వేణు, దేసు సుధాకర్, శీను, రాజేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మెమెంటో అందజేత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని మిల్లంపల్లి ఇలాకాలో గల ప్రభుత్వ గిరిజన గురుకుల పాఠశాలలో గురువారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చిట్టిబాబు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధిం చిన విద్యార్థులను సన్మానించి, మెమెంటోలు అందజేసి శు భాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దయాకర్, సూపరింటిండెంట్ మాల్యాద్రి పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై శిక్షణ

ప్రజాశక్తి-కొత్తపట్నం

మండలంలోని కె.పల్లెపాలెం గ్రామ పంచాయతీలో జగనన్న సురక్షా కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం గ్రామ సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనంద్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. డిప్యూటీ తహశీల్దార్ అర్జున్‌రెడ్డి మాట్లా డుతూ ప్రతి గ్రామంలో సురక్షపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ బాల చెన్నయ్య, ఎంపీటీసీ పిన్ని నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి మణిదీప్, వీఆర్వో సురేష్ పాల్గొన్నారు.

లింగాలదిన్నె ఎస్ఎస్‌వి.రెడ్డికి ప్రశంస

ప్రజాశక్తి-పిసిపల్లి

ఎస్ఎస్‌వి.రెడ్డి

లింగాలదిన్నె ఎస్ఎస్‌వి.రెడ్డికి 10వ తరగతిలో మంచి మార్కులు సాధించినం దుకు ప్రశంసపత్రంతోపాటు రూ.3వేల నగదును అందజేశారు. పెదఇర్లపాడు జడ్‌పి హైస్కూల్‌లో 2023-23 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన లింగాలదిన్నె ఎస్ఎస్‌వి.రెడ్డి ఉత్తమ మార్కులు సాధించి హైస్కూల్‌లో టాపర్‌గానూ, మండల స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచారు. గురువారం కనిగిరి శాసనసభ్యులు బుర్రా మధుసూదన్ ద్వారా ఎంఇఒ ఆర్.శ్రీనివాసులు విద్యార్థిని తండ్రి లక్ష్మీనరసింహారెడ్డికి ప్రశంసపత్రంతోపాటు నగదు అందజేశారు. వీరి తల్లి సఫల అన్నపురెడ్డిలో అంగన్‌వాడి వర్కర్‌గా పని చేస్తున్నారు.

అక్రమ లేఅవుట్లు ఆపలేరా?

అధికారులు పెట్టిన హెచ్చరిక బోర్డులు అదృశ్యం ● కేసు పెట్టని అధికారులు

ప్రజాశక్తి-వేటపాలెం

మండలంలో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అధికారుల ఉదాశీనత.. నిర్లక్ష్యం అక్రమార్కులకు వరంగా మారింది. పట్టించుకోవాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణానికి దగ్గరగా ఒకటి అర లేఅవుట్లు వేసేవారు. చీరాల నియోజకవర్గంలోని పందిళ్లపల్లి నుంచి వాడరేవు వరకు అక్రమ లేఅవుట్లు విస్తరించాయి. 216 జాతీయ రహదారి, సముద్రతీరం వెంట లేఅవుట్లు నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్నాయి. సంవత్సరం క్రితమే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్రమ లేఅవుట్లను గుర్తించారు. హడావుడిగా అక్కాయపాలెం, చల్లారెడ్డిపాలెం, దేశాయిపేట ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కఠారిపాలెం పక్కన సాయిబాబా ఆలయ ప్రాంగణం ఎదురుగా అధికార పార్టీ అనధికార కార్యక్రమాలు చూసే వ్యక్తి ఆదేశం మేరకు ప్రముఖ మాస్టర్ వీవర్‌గా ప్రసిద్ధి చెందిన గౌతమ బుద్ధుని హ్యాండ్‌లూమ్ యజమాని లేఅవుట్‌లో హెచ్చరిక బోర్డు పెట్టారు. అంతా సెటిల్‌మెంట్ అయిన తరువాత బోర్డు తీసేయాలని మళ్లీ అదే వ్యక్తి ఆదేశించడం, అధికారులు పాటించడం గమనార్హం. అక్రమాలకు పాల్పడుతున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇదే అదునుగా అక్రమార్కులు కోట్ల రూపాయలు వెనకేసుకుంటున్నారు. మరోపక్క ప్రభుత్వ ఆదాయానికి పూర్తి స్థాయిలో గండి కొడుతున్నారు. ప్రభుత్వ

అక్కాయపాలెంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు (ఫైల్)

నిబంధనల ప్రకారం వ్యవసాయ భూములలో లేఅవుట్లు వేయాలంటే ఆచుట్టు పక్కల పొలాల యజమానులతో సమావేశం వేయాలి. రెవెన్యూ డివిజినల్ అధికారి సర్వే నెంబర్ గుర్తించి ల్యాండ్ కన్వర్షన్ చేయాలి. పంచాయతీ పర్మిషన్ తీసుకోవాలి. భవిష్యత్ అవసరాల కోసం 15 శాతం స్థలం వదలాలి. లేఅవుట్‌కు తగ్గట్టుగా రోడ్లు నిర్మించాలి. వీటటన్నికంటే ముందు దరఖాస్తుదారులు ప్రభుత్వ రుసుం చెల్లించాలి. ఇలా చేయడానికి బిల్లు టు బిల్లు వసూల్ చేస్తున్నారని విశ్వాసనీయ వర్గాల సమాచారం ఉంది. వందల సంఖ్యలో అక్రమ లేఅవుట్లు ఉన్నా మచ్చుకు ఒకరిపైనా కూడా చర్యలు తీసుకున్న దాఖలా లేవు. మండలంలో చల్లారెడ్డిపాలెం, రామన్నపేట, అక్కయ్యపాలెం, కొత్తపేట పంచాయతీల్లో ఈ వ్యవహారం మూడు పువ్వులు ఆరుకాయల చందంగా నడుస్తుంది. వేటపాలెం, దేశాయిపేట పంచాయతీల్లో అనధికార అపార్ట్‌మెంట్లు సైతం వెలిశాయి. ఇలాంటి అక్రమాల గురించి సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తుదారులకు అధికారులే తప్పుడు సమాచారం ఎలాంటి బెరుకు లేకుండా ఇస్తున్నారని మేలుకొలుపు వినియోగదారుల సంరక్షణ సంఘం కార్యదర్శి దాసరి ఇమ్మానుయేలు ప్రజాశక్తితో వాపోయారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ వేటపాలెం మండలంలో జరుగుతున్న అక్రమ లేఅవుట్లను నివారించి ప్రజల మన్ననలు పొందాలని పలువురు కోరుతున్నారు.

అధికారులు తప్పుడు సమాచారం ఇస్తున్నారు: దాసరి ఇమ్మానుయేలు, మేలుకొలుపు వినియోగదారుల సంరక్షణ సంఘం కార్యదర్శి

తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి అధికారులు నిర్భయంగా తప్పుడు సమాచారం ఇస్తున్నారు. వేటపాలెం, దేశాయిపేట పంచాయతీల్లో అపార్ట్‌మెంట్లకు ఇచ్చిన అనుమతుల వివరాలు కావాలని అడిగితే అపార్టమెంట్లే లేనట్టుగా సమాచారం ఇచ్చారు. లేఅవుట్ల సమాచారం తెలీదని ఇచ్చారు. చీరాల నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమాల గురించి ప్రత్యేక అధికారితో కలెక్టర్ విచారణ జరిపించి నిజానిజాలు నిగ్గ తేల్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తెలుగు రైతు పదవికి అక్కయ్య చౌదరి రాజీనామా

ప్రజాశక్తి-కారంచేడు

మండలంలోని కారంచేడుకు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ అక్కయ్య చౌదరి గురువారం నాడు తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామాను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచెన్నాయుడుకు పంపినట్లు తెలిపారు. 30 ఏళ్లకు పైగా పర్చూరు నియోజకవర్గంలోని కారంచేడు మండలంలో టిడిపి అభివృద్ధికి కృషి చేసి అనేక పదవులు నిర్వహించిన అక్కయ్య చౌదరి తన పదవికి రాజీనామా చేయడంతో తెలుగుదేశం పార్టీ వర్గాలు విస్మయానికి గురయ్యాయి. తెలుగుదేశం పార్టీ ప్రారంభం నుంచి కారంచేడు ప్రాంతంలో కార్యకర్తగా తన సేవలను ప్రారంభించిన యార్లగడ్డ అక్కయ్య చౌదరి కారంచేడులోని పంచాయతీ వార్డు సభ్యునిగా, కారంచేడు ఎంపీపీగా, తర్వాత కారంచేడు కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షునిగా, అనంతరం పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పదవులు నిర్వహించి ప్రస్తుతం కారంచేడు ఎంపీటీసీగా, తెలుగుదేశం పార్టీ తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. అయితే తన రాజీనామాకు ప్రత్యేకంగా కారణాలు ఏమి చెప్పకపోయినా ప్రస్తుతం పర్చూరు నియోజకవర్గంలో ఉన్న తెలుగుదేశం పార్టీ పరిస్థితి దృష్ట్యా తాను తన రాష్ట్ర పదవికి మాత్రమే రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు. అయితే బుధవారం నాడు కారంచేడులో ఏర్పాటు చేసిన నూతన తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి శాసనసభ్యులు ఏలూరు సాంబశివరావుని ఆహ్వానించినా అతను రాలేదని, అలాగే గురువారం నాడు జరిగిన భవిష్యత్తు గ్యారెంటీ బస్సు యాత్రలో భాగంగా కారంచేడు నుంచి ప్రారంభించిన ఏలూరి సాంబశివరావు స్థానిక పార్టీ కార్యాలయానికి వచ్చి జెండా ఎగురవేసి అటు నుంచి అటే యాత్రలో భాగంగా ర్యాలీగా వెళ్లిపోవడం తో కార్యాలయం ఏర్పాటు చేసిన అక్కయ్య చౌదరికి, కొంతమందిపార్టీ కార్యకర్తలకు, అవమానంగా తోచిందని, అందుకని ఆయన తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి పదవికి రాజీనామా చేసినట్లుగా తెలుస్తోంది. అయితే కార్యాలయం ఏర్పాటు విషయమై స్థానిక పార్టీలోనే కొన్ని భేదాభిప్రాయాలు ఉన్నట్లుగా స్థానికంగా చర్చ జరుగుతుంది. దీ నిపై టిడిపి రాష్ట్ర నాయకత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో తెలియాల్సి ఉంది.

జగనన్న ఆణిముత్యాలు కాదు.. అబ్దుల్ కలాం స్కాలర్‌షిప్‌లు

ప్రజాశక్తి-బాపట్ల

పదేళ్ళుగా ప్రతిభగల విద్యార్థులకు అందించే మెరిట్ స్కాలర్ షిప్‌లు అబ్దుల్ కలాం పేరుపై కొనసాగుతున్నాయని, వాటినిజగనన్న ఆణిముత్యాలుగా పేరు మార్చడం పట్ల కాంగ్రెస్ పార్టీ బాపట్ల జిల్లా మైనారిటీ అధ్యక్షులు రాజేష్ అభ్యంతరం వ్యక్తం చేశారు. గురువారం బాపట్ల పట్టణంలో అబ్దుల్ కలాం విగ్రహం వద్ద బాపట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డి దేవరాజ్‌తో కలిసి రాజేష్ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జాతీయ పురస్కారాలకు మౌలానా ఆజాద్ పేరును మార్చేసి ఆంధ్రప్రదేశ్‌లో అబ్దుల్ కలాం పేరు మార్చడం బిజెపి ప్రభుత్వంతో వైసిపి లోపాయికారి ఒప్పందంతోనే జరిగిందని విమర్శించారు. జగనన్న ఆణిముత్యాలు కాదు.. అబ్దుల్ కలాం స్కాలర్షిప్‌లుగా కొనసాగాలని ఆయన అన్నారు. ఇప్పటికైనా అబ్దుల్ కలాం పేరును కొనసాగించి ఆ మహనీయులను గౌరవించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కట్ట లాజర్, ఎస్వీఆర్ కుమార్, బక్కా రోశయ్య, దండు రేణుక, నళిని, చరణ్‌మయి, శాంతి, శీలం సాగర్, ముత్తయ్య, రషీద్, డి రాజు, రవి, హన్ను పాల్గొన్నారు.

ఆరు వారాల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-అద్దంకి: మండలంలోని వేలమూరిపాడు గ్రామంలో ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న కూలీలకు గత ఆరువారాలుగా ఇవ్వాల్సిన వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు గురువారం డిమాండ్ చేశారు. కూలీల సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ గత ఆరువారాల నుంచి వేతనాలు చెల్లించలేదని రోజువారి కూలి చేసుకొని బతికే మేము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని కూలీలు తెలియజేశారు. తీవ్రమైన ఎండలో పనిచేసిన కూలీలకు వేతనాలు ఇవ్వకపోవడం దారుణమైన విషయం అన్నారు. అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటన చేసి కూలీలందరినీ ఐక్యం చేసి పెద్దఎత్తున ఆందోళన చేపట్టాల్సి వస్తుందని ఈ సందర్భంగా తంగిరాల వెంకటేశ్వర్లు తెలియజేశారు. అదే విధంగా కూలీలకు కనీస రోజు వేతనం రూ.600 ఇవ్వాలని, సంవత్సరంలో కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. పొరుగునున్న కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో 350 రూపాయలు వేతనం ఇస్తున్నారని అన్నారు. సమ్మర్ అలవెన్సు, మంచినీళ్లు, పలుగు, పార అలవెన్సులు కూడా ఇవ్వాలని, పాత గ్రూపుల విధానం అమలు చేయాలని, అవినీతి అక్రమాలను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డేవిడ్, రవి, అంజయ్య, కూలీలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు తంగిరాల వెంకటేశ్వర్లు

కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, అమర్నాథ్ కుటుంబ సభ్యులు

హంతకులను శిక్షించాలని కొవ్వొత్తులతో ర్యాలీ

ప్రజాశక్తి-చెరుకుపల్లి

ఉప్పాల అమర్నాథ్ హంతకులను కఠినంగా శిక్షించాలంటూ అమర్నాథ్ స్వగ్రామం ఉప్పాలవారిపాలెంలో సిఐటియు నేతృత్వంలో బుధవారం రాత్రి కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి మనోజ్ కుమార్, శరత్, అమర్నాథ్ కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. అమర్నాథ్‌కు నివాళి అర్పించారు.

28న మండల సమావేశం

ప్రజాశక్తి-సంతమాగులూరు

ఈనెల 28వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశం హాలులో, మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో జీ లక్ష్మీదేవి తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయం, తాగునీరు, సాగునీరు, పారిశుధ్యం, వైద్యం, ఉపాధి హామీ, వెలుగు, పశు వైద్యం, విద్యుత్, విద్య, గృహ నిర్మాణం, ఐసిడిఎస్ తదితర శాఖలపై సమీక్ష సమావేశం జరుగుతుందన్నారు. సంబంధిత శాఖల అధికారులు ముందుగా తమ అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర నివేదికలను అందజేయాలని ఎంపీడీవో తెలియజేశారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన

ప్రజాశక్తి-కొల్లూరు

కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మండల వైద్యాధికారి సుష్మ అన్నారు. కొల్లూరులోని పీహెచ్‌సిలో గురువారం ఆశ ఏఎన్ఎంలకు కుష్టు వ్యాధిపై అవగాహన సమావేశం జరిగింది. వైద్యాధికారి సుష్మా మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి జూలై 16 వరకు ఆశ వర్కర్స్, వాలంటీర్లు టీములుగా గృహాల సర్వే చేయాలన్నారు. కుష్టు వ్యాధికి చికిత్స పీహెచ్‌సిలో ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. చికిత్స సక్రమంగా తీసుకుంటే వ్యాధి నయమవుతుందని అన్నారు.

తహసీల్దార్ వెంకటేశ్వరరావుకు అభినందనలు తెలుపుతున్న ఎంపిపి డివి లలితకుమారి

భట్టిప్రోలు తహశీల్దారుగా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు మండల నూతన తహశీల్దారుగా డి వెంకటేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఎంపిపి డివి లలితకుమారి పలువురు నాయకులు, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. ఈయన రేపల్లె మండల రెవెన్యూ కార్యాలయంలో డిటి గాను సివిల్ సప్లయ్‌లో పని చేస్తూ పదోన్నతిపై భట్టిప్రోలు తహశీల్దారుగా భాధ్యతలు తీసుకున్నారు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

'వరికపూడిసెల' ప్రాజెక్టుకు

జులైలో సిఎం జగన్ శంకుస్థాపన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పల్నాడు, ప్రకాశం జిల్లాలోని మండలాలకు తాగు, సాగునీరు అందించేందుకు వరికపూడిసెల ప్రాజెక్టుకు జూలై మొదటి వారంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ గురువారం తెలిపారు. పల్నాడు జిల్లాలలోని మాచర్ల, గురజాల, దుర్గి, బొల్లాపల్లి మండలాలతో పాటు ప్రకాశం జిల్లాలోని పుల్లలచెరువు మండలంలో గల 10,456 ఎకరాలకు ఈ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందుతుందని మంత్రి తెలిపారు. అంతేకాకుండా మరో మూడు గ్రామాలకు తాగునీరు అందుతుందని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న జాలా అంజయ్య

ఐక్యంగా ఉండి..

'ఉపాధి'ని రక్షించుకోవాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు జాలా అంజయ్య

ప్రజాశక్తి-పామూరు

వ్యవసాయ కూలీలు ఐక్యంగా ఉండి జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవాలని ఆ సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు జాలా అంజయ్య అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద యేటా వీరనారాయణ అధ్యక్షతన ధర్నా జరిగింది. ఈ సందర్భంగా జాలా అంజయ్య మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని తీసివేయాలని కుట్ర పన్నుతోందని, దీనిని కూలీలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. దేశంలో వ్యవసాయ కార్మికుల కుటుంబాలకు ఉపాధి జీవనోపాధిగా ఉందన్నారు. వ్యవసాయ కార్మికులు ఐక్యమై ఈ చట్టాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదేనన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఉపాధి కూలీలకు రూ. 2 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సిఐటియు మండల కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి మాట్లాడుతూ ప్రతి కూలీకి సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజు వేతనం రూ. 600 వచ్చేలా చర్యలు తీసుకోవాలని, అవినీతిలేని చట్టాన్ని అమలుపర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశవ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కూలీలకు ఒకే పనిలో కూలీ తేడాలు ఉంటున్నాయని, వాటిని సరిచేయాలని నాలుగురోజులు పనిచేసిన వారికి మస్టర్లు వేయడంలేదని, వెంటనే నాలుగురోజులకు మస్టర్లు వేసి డబ్బులు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మహాదేవయ్య, మాధవకృష్ణ, అంకయ్య, మాలకొండయ్య, రమణమ్మ, ఆదిలక్ష్మమ్మ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఉద్యోగోన్నతి

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.నాగేశ్వరరావు

ప్రజాశక్తి-మార్కాపురం

విద్యుత్‌శాఖ మార్కాపురం డివిజన్ పరిధిలో నిబంధనల మేరకే ఉద్యోగోన్నతి కల్పించినట్లు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.నాగేశ్వరరావు గురువారం తెలిపారు. ప్రజాశక్తి టాబ్లాయిడ్‌లో 'అనుకూలమా.. ఆలస్యం దేనికి...' అనే శీర్షికతో వెలువడిన కథనంపై ఇఇ నాగేశ్వరరావు వివరణ ఇచ్చారు. ఈ నెల 15న షేక్.గౌస్‌మోహిద్దీన్ అనే లైన్‌ఇన్‌స్పెక్టర్ అనారోగ్యంతో మృతి చెందినట్లు తెలిపారు. ఆయన స్థానంలో డిపార్టుమెంటు ప్రక్రియలో భాగంగా అంతకుమునుపే ఆమోదించబడిన ఉద్యోగోన్నతి జాబితాలోని అభ్యర్థులకు లైన్‌మెన్ నుండి లైన్‌ఇన్‌స్పెక్టర్‌గా, అసిస్టెంట్ లైన్‌మెన్ నుండి లైన్‌మెన్‌గా 16వ తేదిన పదోన్నతి కల్పించినట్లు తెలిపారు.

వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం

కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

వైద్య రంగానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. గురువారం ఒంగోలులోని సెంట్రల్ డ్రగ్ స్టోర్ ప్రాంగణంలో అత్యాధునిక సదుపాయాలతో కూడిన నూతన రిఫ్రిజిరేటర్ వాహనాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ వాహనాన్ని ప్రకాశం జిల్లాకు కేటాయించడం శుభపరిణామమన్నారు. పెద్ద వాహనం కావటంతో ఒకేసారి ఎక్కువ కేంద్రాలకు మందులను త్వరగా సరఫరా చేయడానికి వీలుంటుందన్నారు. ఈ వాహనం ద్వారా మందులను ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 1009 ఆరోగ్య కేంద్రాలకు సరఫరా చేయవచ్చన్నారు. మైనస్ 23 డిగ్రీల ఉష్ణోగ్రతలో కూడా వ్యాక్సిన్లను, మందులను స్టోర్ చేసుకుని సరఫరా చేయవచ్చన్నారు. అనంతరం సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. డ్రగ్ స్టోర్ లో ఉన్న మందులు, వాటిని నిల్వ చేస్తున్న విధానం, ఈ-ఔషధి, రికార్డు రూము నిర్వహణ వంటి అంశాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏ.పి.ఎం.ఎస్.ఐ.డి.పి. ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎం. విజయభాస్కర్, స్టోర్ మేనేజర్ రాజశేఖర్ రెడ్డి, ప్రోగ్రామింగ్ మేనేజర్ జె. విజయ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

25న టిడిపి అధినేత చంద్రబాబు రాక

చిన్నగుడిపాడు చేరుకోనున్న బస్సుయాత్ర

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన బస్సు యాత్ర ఈ నెల 25వ తేదిన పెద్దదోర్నాల మండలంలోని చిన్నగుడిపాడు గ్రామానికి చేరుతుందని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. గురువారం యర్రగొండపాలెంలోని టిడిపి కార్యాలయంలో ఆయన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ వైసిపి రాళ్లదాడిలో మృతి చెందిన రాజయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.10 లక్షల పరిహారం అందజేస్తారని తెలిపారు. అనంతరం అక్కడ రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని చెప్పారు. అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సు కోసం చంద్రన్న మినీ మేనిఫెస్టోను ప్రవేశపెట్టారని తెలిపారు. నరకాసుర పాలన విముక్తి కోసం జరిగే బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటికి ఒకరు చొప్పున పాల్గొనాలని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, నాయకులు చిట్టేల వెంగళరెడ్డి, మంత్రూ నాయక్, షేక్ చిన్నవలి, కామేపల్లి వెంకటేశ్వర్లు, గోళ్ల సుబ్బారావు, కోటయ్య, తోటా మహేష్ నాయుడు, షేక్ మస్తాన్‌వలి, గురిజేపల్లి జిలాని, చేదూరి కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

కస్తూరిబా విద్యాలయాల్లో

గెస్ట్ లెక్చరర్లను కొనసాగించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వినోద్ డిమాండ్

- వారి పోరాటానికి మద్దతు

మాట్లాడుతున్న వినోద్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కస్తూరిభా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కెజిబివి) అతిథి అధ్యాపకులుగా పనిచేస్తున్న వారిని కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ డిమాండ్ చేశారు. స్థానిక సమగ్ర శిక్ష అభియాన్ కార్యాలయం వద్ద అతిథి అధ్యాపకులు చేస్తున్న ధర్నాకు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ మద్దతు తెలియజేసింది. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ కెజిబివిలలో గత సంవత్సరం అతిథి అధ్యాపకులుగా కొనసాగిన వారిని ప్రస్తుత ప్రభుత్వం రద్దుచేసి, కొత్తవారిని తీసుకోవడానికి నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. దీంతో జిల్లాలోని అతిథి అధ్యాపకులకు తీవ్రమైన అన్యాయం జరిగిందని, ఇప్పటివరకు పని చేయటంతో వారిని గుర్తించి కాంట్రాక్ట్‌గా తీసుకొని రెన్యువల్ చేయాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన కొత్త నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇన్నాళ్లు టీచర్లు చేత బోధన చేయించుకుని ఇప్పుడు తిరిగి ఇంటికి పంపడం సరికాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉదతం కాకముందే ఈ సమస్యను సామరస్యంగా పరిష్కారం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాలోని అతిది అధ్యాపకులు మరియు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్, ఒంగోలు నగర అధ్యక్ష కార్యదర్శులు శశాంక్ హేమంత్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఇంతటి నీచమైన పాలనను

ఎన్నడూ చూడలేదు..

- వైసిపిపై టీడీపీ మాజీ మంత్రి సోమిరెడ్డి ధ్వజం..

- భవిష్యత్తుకు గ్యారెంటీ బస్సు యాత్రకు ఘనస్వాగతం

ప్రజాశక్తి-టంగుటూరు

తన రాజకీయ జీవితంలో ఇంతటి నీచమైన పరిపాలనను ఎన్నడూ చూడలేదని టిడిపి పొలిటి బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు రాజమండ్రి మహానాడులో ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారెంటీ.. బస్సు యాత్ర - పల్లె నిద్ర కార్యక్రమం గురువారం కొండపి నియోజకవర్గం టంగుటూరు మండలంలో జరిగింది. మండలంలోని సూరారెడ్డిపాలెంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు టిడిపి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తుకు గ్యారెంటీ బస్సు యాత్రకు ఒంగోలు నుండి ప్రజలు బ్రహ్మారథం పడుతున్నట్లు తెలిపారు. గురువారం మధ్యాహ్నం తూర్పునాయుడుపాలెంలోని ఐఓసీ ఎదురుగా ఉన్న దామచర్ల సత్య కంపెనీ

యాత్రలో పాల్గొన్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ఆవరణలో బస్సు యాత్ర, పల్లె నిద్ర కోసం విచ్చేసిన టిడిపి నాయకులు సత్య కంపెనీ ఆవరణలో బస చేసి సాయంత్రం పల్లె నిద్ర కోసం జరుగుమల్లి మండలం నందనవనం గ్రామానికి నాయకులు తరలి వెళ్లారు. కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పనబాక లక్ష్మి, నూకసాని బాలాజీ, దామచర్ల జనార్దన్, దామచర్ల సత్య, బెజవాడ వెంకటేశ్వర్లు, కామని నాగశ్రీను, అబ్బూరి అభిషేక్, కొమ్మినేని వెంకట్రావు, ఈదర ప్రభాకర రావు, రామా గోపి, చదలవాడ చంద్రశేఖర్, కొమ్మి శ్రీనివాసరావు, నర్రా శైలుషా మొలకలపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సైకో నుండి కాపాడాలని కోరుకున్నా..

ఈ సైకో జగన్ రెడ్డి నుండి రాష్ట్రాన్ని కాపాడాలని శ్రీ వల్లూరమ్మ తల్లిని కోరుకున్నట్లు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. భవిష్యత్తుకు గ్యారెంటీ, బస్సు యాత్ర, పల్లెనిద్ర కోసం కొండపి నియోజకవర్గం టంగుటూరు మండలంలోకి ప్రవేశించిన బస్సు యాత్ర బందం గురువారం మండలంలోని శ్రీ వల్లూరమ్మ దేవస్థానంలో వల్లూరమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వల్లూరమ్మ దేవస్థానం సిబ్బంది నాయకులకు ఘన స్వాగతం పలికారు.

2024లో

పచ్చనేతల ఊసే ఉండనివ్వరు

మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

టిడిపి అధినేత చంద్రబాబు చేసిన మోసాలను అనుభవించిన ప్రజలు 2019లో తగిన బుద్ధి చెప్పారని, తిరిగి 2024లోనూ రాష్ట్రంలో పచ్చనేతల ఊసే లేకుండా చేస్తారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. మండలంలోని గురిజేపల్లి గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ఇంటింటికీ వెళ్లి అభివద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. పలు చోట్ల ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి జగన్ పరిపాలన చాలా బాగుందని, సంక్షేమంతో పాటు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని తెలిపారు.

చంద్రబాబుది మోసం చేసే నైజం..

14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రి పదవిలో కొనసాగిన చంద్రబాబుకు ప్రజా సమస్యలు పట్ట లేదని, ఆయనది మోసం చేసే నైజమని విమర్శించారు. ఎన్నికల ముందు వాగ్దానం చేస్తాడని, ఆ తరువాత మోసం చేస్తాడని వ్యంగ్యంగా అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది పచ్చ నేతలు రాష్ట్రంపై పడి శుష్క

బోరును ప్రారంభిస్తున్న మంత్రి సురేష్

వాగ్దానాలు చేస్తుంటారని, వారి మాటల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందుగా నూతనంగా ఏరాటు చేసిన తాగునీటి బోరును ప్రారంభించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్పిటిసి చేదూరి విజయభాస్కర్, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, సర్పంచ్ ఫిలిప్, మైనార్టీ మండల అధ్యక్షుడు షేక్ వలి, వైసిపి సోషల్ మీడియా నియోజకవర్గ కో కన్వీనర్ షేక్ ఖాసింబాషా, నాయకులు నర్రెడ్డి వెంకటరెడ్డి, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.